నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 7-7-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:265 పేజీలు:6 వెల: రూ.1/-

ఎపి,తెలంగాణ ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌ల భేటి..

హైదరాబాద్, జులై 6 :తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు లు నేడు ప్రజా భవన్ లో కొద్ది సేపటి క్రితం సమావేశమయ్యారు.

ప్రస్తుతం ఈ సమావేశం కొనసాగుతున్నది. ప్రజా భవన్ కు చేరుకున్న చంద్రబాబు కు రేవంత్ రెడ్డి సాదరపూర్వక స్వాగతం పలికారు

కాగా, గత పదేండ్లుగా పరిష్కారం కాకుండా ఉన్న రాష్ట్ర విభజన చట్టంలోని అంశాలపై ఈ భేటీలో చర్చించనున్నారు. విభజన సమస్యల పరిష్కారమే ఎజెండాగా జరగనున్న ఈ భేటీలో రెండు రాష్ట్రాల సీఎంలతో పాటు పలువురు మంత్రులు, అధికారులు పాల్గొంటున్నారు..

రేవంత్ రెడ్డి, చంద్రబాబు ముఖ్యమంత్రుల హోదాలో ఫస్ట్ టైమ్ మీట్ కాబోతోన్న నేపథ్యంలో ఈ భేటీపై తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోనూ తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

చురక

విభజన సమస్యలపై
వీడిపోని చిక్కు ముళ్లు
రాజకీయ వైఖరుల్లో
రగిలి మిగిలే ఇన్నేళ్లు.

ముఖ్యమంత్రులిద్దరిలో
ముందడుగు వాదనలు
లేకుంటే పరిష్కృతిలో
లెక్కలేని ఖేదనలు

-వేల్పుల నారాయణ
9440433475

నియోజకవర్గానికో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, జులై 6 :గ్రామీణ ప్రాంతాల్లోని యువత పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు ప్రతినియోజకవర్గంలో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లను ప్రారంభించనున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి మల్లు విక్రమార్క అన్నారు. పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్కతో కలిసి సచివాలయంలో బడ్జెట్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షల కోచింగ్‌కు నిపుణులైన వారితో ఉచితంగా గ్రామీణ యువతకు శిక్షణ ఇప్పిస్తామన్నారు. నాలుగు నెలల్లో ఈ నాలెడ్జ్ సెంటర్ల నిర్మాణాలు పూర్తవుతాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలన్నారు. యువత ఉపాధి లేక ఇబ్బందులుపడుతున్నారని. వారిని అలాగే వదిలేస్తే సమాజం ఇబ్బందిపడుతుందన్నారు. ఫీజు రీయింబ్స్‌మెంట్ పథకం అందుబాటులోకి రావడంతో వేలాది మంది బీటెక్ పూర్తి చేసి.. స్కిల్స్ లేక గ్రామాల్లోనే ఉండిపోతున్నారని.. ఆర్థికంగా ఉన్నవారు, తోడ్పాటు అందిన వారు విదేశాల్లో స్థిరపడుతున్నారన్నారు.

గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న స్కిల్ దెవలప్‌మెంట్ సెంటర్‌ను హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా మొదట పాత ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో సెంటర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలోని ఉపాధి కల్పన, మార్కెటింగ్ మిషన్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు ఎంతమందికి శిక్షణ ఇచ్చారు.. వారు ప్రస్తుతం ఏం చేస్తున్నారో వివరాలు సేకరించాలని ఆదేశించారు. హైదరాబాద్‌లోని సాఫ్ట్‌వేర్ కంపెనీలతో అనుసంధానం చేసుకొని ఉపాధి కల్పించే అంశంపై దృష్టి పెట్టాలన్నారు. ఈ సందర్భంగా మిషన్ మిషన్ భగీరథ పథకం పనితీరుపై ఈ నెల 15 వరకు నివేదిక ఇవ్వాలని కోరారు. నివేదికను అందరు ఎమ్మెల్యేలకు అందజేసి ఇంటింటికి నీరు అందుతుందా? అన్న విషయాన్ని నిర్ధారించుకోవాలన్నారు. మిషన్ భగీరథ నీటిని వినియోగించుకునే అంశం గ్రామసభల్లో ఓ ఎజెండాగా చేర్చాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. సమావేశంలో పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి హరిత, పంచాయతీరాజ్ శాఖ అధికారులు దివ్య దేవరాజన్, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రెటరీ కృష్ణ భాస్కర్ పాల్గొన్నారు.

జులై 22 నుంచి ఆగస్టు 12 వరకు పార్లమెంటు సమావేశాలు

- జులై 23న కేంద్ర బడ్జెట్ -ఏడోసారి బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ జూలై 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్); : కేంద్రంలో ఎన్డీయే 3.0 ప్రభుత్వం వచ్చాక మొదటిసారిగా పూర్తి స్థాయి పార్లమెంటు సమావేశాలు నిర్వహించనున్నారు. జులై 22 నుంచి పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయి. బడ్జెట్ సమావేశాలు ఆగస్టు 12 వరకు కొనసాగనున్నాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ జులై 23న బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. ఈ మేరకు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. నిర్మలా సీతారామన్ తాజాగా ఆర్బీఐ గవర్నర్ తో సమావేశమయ్యారు. బడ్జెట్ కేటాయింపుల అంశంపై చర్చించారు. నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టడం ఇది ఏడోసారి.

ఇరాన్ నూతన అధ్యక్షుడు పెజెష్కియాన్‌ను అభినందించిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, జులై 6 :ఇరాన్ నూతన అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ను ప్రధాని నరేంద్రమోదీ అభినందించారు. 'ఇరాన్ అధక్ష పీఠాన్ని అధిరోహిస్తున్న మసూద్ పెజెష్కియాన్‌కు హృదయపూర్వక అభినందనలు' అని మోదీ తన అధికారిక ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. ఇరు దేశాల ద్వైపాక్షిక బంధాలను మరింత బలోపేతం చేయడం కోసం ఇరాన్ నూతన అధ్యక్షుడితో కలిసి పనిచేస్తామని మోదీ తన పోస్టులో రాశారు.

కాగా, ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ (63) హెలికాప్టర్ ప్రమాదంలో మరణించడంతో ఆ దేశంలో అధ్యక్ష ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ఇరాన్ కొత్త అధ్యక్షుడిగా సంస్కరణవాది అయిన మసూద్ పెజెష్కియాన్ విజయం సాధించారు. ఆయన తన ప్రత్యర్థి సంప్రదాయవాది సయీద్ జలీలీపై గెలిచారు. లెక్కించిన మొత్తం 3 కోట్ల ఓట్లలో పెజెష్కియాన్‌కు అనుకూలంగా 1.6 కోట్లకుపైగా ఓట్లు (53.3 శాతం) రాగా.. జలీలీకి 1.3 కోట్లకుపైగా ఓట్లు (44.3 శాతం) ఓట్లు వచ్చాయి.

ఇరాన్ రాజ్యాంగం ప్రకారం మొత్తం పోలైన ఓట్లలో 50 శాతం ఓట్లు సాధించిన అభ్యర్థినే అధ్యక్షుడిగా నియమిస్తారు. అలా రానప్పుడు అగ్రస్థానంలో ఉన్న ఇద్దరు అభ్యర్థుల మధ్య వారం రోజుల తర్వాత రన్‌ఆఫ్ పోలింగ్ నిర్వహించాలి. జూన్ 28న జరిగిన తొలి రౌండ్ ఎన్నికల్లో కేవలం 40 శాతం పోలింగ్ మాత్రమే నమోదైంది. దాదాపు 60 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోలేదు. ఆ రౌండ్‌లో ఏ అభ్యర్థికి మెజారిటీ రాలేదు. దీంతో జూలై 5న రన్‌ఆఫ్ పోలింగ్ నిర్వహించారు.

హైదారాబాద్‌లో డ్రగ్స్‌ను కట్టడి చేయండి..

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కేఏబీ శాస్త్రి ఆదేశాలు

హైదరాబాద్, జులై 6 :డ్రగ్స్‌ను నిరోధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకుంటుందని, ఈ మేరకు ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలు సమర్థవంతంగా పని చేసి డ్రగ్స్‌ను కట్టడి చేయాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కేఏబి శాస్త్రీ అదేశించారు. అబ్కారీ భవన్ సమావేశ మందిరంలో శనివారం హైదరాబాద్ డివిజన్ అధికారుల సమీక్షా సమావేశం జరిగింది. డ్రగ్స్‌పై ఈ మధ్యకాలంలో ఎన్ని కేసులు నమోదు అయ్యాయి..? ఎంత మందిని అరెస్టు చేశారనే విషయంపై చర్చంచారు.

ప్రధానంగా ఇటీవల అమల్లోకి వచ్చిన కొత్తచట్టాల ప్రకారం కేసులు నమోదు చేయాలని, నిందితులకు శిక్ష పడేవిధాంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మరో పక్క డ్రగ్స్ రవాణా, అమ్మకాలు, వినియోగంపై గట్టి నిఘా పెట్టాలని, సమాచారం ఇవ్వడానికి అవసరమైన సోర్స్‌ను పెంచుకోవడానికి అవసరమైన ఏర్పాట్లను చేసుకోవాలన్నారు. మరోపక్క పెట్రోలింగ్ పెంచి డ్రగ్స్‌ను అరికట్టడంపై దృష్టి సారించాలన్నారు.

అనుమతి లేని స్థలాల్లో మద్యం సేవించడం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగించే ప్రాంతాలను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అనుమతి పొందిన ఈవెంట్లలో నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్ రాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ అనిల్ కుమార్, ఎక్సైజ్ సూపరిండెంట్ విజయ్‌తోపాటు సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

గ్రామీణ నిరుద్యోగులపై దృష్టి పెట్టండి - డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి సీతక్క

హైదరాబాద్, జులై 6 : గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే అంశాన్ని చాలా సీరియస్ గా తీసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు పంచాయతీ రాజ్ శాఖ అధికారులను కోరారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కతో కలిసి శనివారం సచివాలయంలో బడ్జెట్ సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామీణ యువత ఉపాధి లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు, వాళ్లను అలా వదిలేస్తే సమాజం ఇబ్బంది పడుతుందని వివరించారు. ఫీజు రియంబర్స్మెంట్ పథకం అందుబాటులోకి రావడంతో వేలాదిమంది బీటెక్ పూర్తి చేసి, స్కిల్స్ లేక గ్రామాల్లోనే ఉండిపోతున్నారని, ఆర్థికంగా ఉన్నవారు, తోడ్పాటు అందిన వారు మాత్రం విదేశాల్లో స్థిరపడుతున్నారని వివరించారు. గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను హైదరాబాద్ కి పరిమితం చేయకుండా, మొదట పాత ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ల ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలోని ఉపాధి కల్పన, మార్కెటింగ్ మిషన్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు ఎంతమందికి శిక్షణ ఇచ్చారు, వారు ప్రస్తుతం ఏం చేస్తున్నారు వివరాలు సేకరించాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాదులోని సాఫ్ట్ వేర్ కంపెనీలతో అనుసంధానం చేసుకొని ఉపాధి కల్పించే అంశంపై పెట్టాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువత ఉచితంగా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు రాబోయే వారం రోజుల్లోనే ప్రతి నియోజకవర్గ కేంద్రంలో అంబేద్కర్ నాలెడ్జ సెంటర్లను ప్రారంభించబోతున్నట్టు తెలిపారు. పోటీ పరీక్షల కోచింగ్ కు నిపుణులైన వారితో ఉచితంగా గ్రామీణ యువతకు శిక్షణ ఇప్పించనున్నట్టు వివరించారు. నాలుగు నెలల్లోనే ఈ నాలెడ్ సెంటర్ల నిర్మాణాలు సైతం పూర్తి చేస్తామన్నారు.

ఉపాధి హామీ పథకం కింద చెరువుల్లో పూ డికతీత పనులు చేపట్టారు, రైతులు ఉచితంగా ఆ పూడిక మట్టిని పొలాలకు తరలించుకున్నారు, అయినా అవి పక్కకు పెట్టి గత పది ఏళ్లలో మిషన్ భగీరథ పేరిట 25 వేల కోట్లు ఖర్చు చేయడంపై అధికారులను ఆరా తీశారు. ఉపాధి హామీలోని పూడికతీత పనులను విస్తృతంగా వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు.

ఆవాన గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలను సంతృప్త స్థాయిలో పూర్తి చేసేందుకు చేయాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రతి నియోజకవర్గంలో కొన్ని ప్రాంతాలను ఎంపిక చేసుకొని పూర్తిస్థాయిలో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టారు. వాటిని పరిశీలించాలని డిప్యూటీ సీఎం అధికారులకు సూచించారు. కేంద్ర బడ్జెట్ చూసి పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు నిధులు మలుచుకునే ప్రయత్నం చేయాలని డిప్యూటీ సీఎం సూచించారు. గత ఐదు సంవత్సరాల కాలంలో మ్యాచింగ్ గ్రాంట్స్ వినియోగించి కేంద్ర నిధులను సాధించుకునే అంశంలో పూర్తిగా నిర్లక్ష్యం చెప్పారు. ఈసారి ఆ పొరపాటు జరగవద్దని తెలిపారు. స్వీవర్ల వేతనాలు పెండింగ్లో ఉంటే వాటికి సంబంధించిన వివరాలు వెంటనే పంపాలని అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ పథకం పనితీరుపై ఈనెల 15వ తేదీ వరకు నివేదిక ఇవ్వాలని కోరారు. ఆ నివేదికను అందరు ఎమ్మెల్యేలకు అందజేసి ఇంటింటికి నీరు అందుతున్న విషయాన్ని నిర్ధారించుకోవాలని తెలిపారు.

మిషన్ భగీరథ పథకం ద్వారా ఆదాయం సాధించి అప్పు చెల్లిస్తామని 30 వేల కోట్లు రుణం తీసుకొచ్చారు, కానీ ఆదాయం సాధించడం, అప్పు చెల్లించడంలో కార్పొరేషన్ పూర్తిగా విఫలమైందని డిప్యూటీ సీఎం అన్నారు. కార్పొరేషన్ విఫలం కావడం మూలంగా ప్రభుత్వమే ఆ అప్పులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అసలు గ్రామాల్లో మిషన్ భగీరథ నీటిని ఎంత శాతం మేరకు వినియోగిస్తున్నారు అనే అంశాన్ని సర్వేలో చేర్చాలని ఆదేశించారు. 60 శాతం మంది మాత్రమే మిషన్ భగీరథ నీటిని వినియోగిస్తున్నారని అధికారులు తెలిపారు. 30 వేల కోట్లు ఖర్చు చేసి పూర్తిస్థాయిలో ఈ పథకాన్ని వినియోగించుకోకపోతే అర్థం లేదని డిప్యూటీ సీఎం అన్నారు. మిషన్ భగీరథ నీటి నాణ్యత, ఆరోగ్యం తదితర అంశాలపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేసి చైతన్యం చేయాలని అధికారులను కోరారు. మిషన్ భగీరథ నీటిని వినియోగించుకునే అంశం గ్రామ సభల్లో ఒక ఎజెండాగా చేర్చాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు.

సమావేశంలో పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తనియా, ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి హరిత, పంచాయతీరాజ్ శాఖ అధికారులు దివ్య దేవరాజన్, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అమర్‌నాథ్ యాత్ర తాత్కాలికంగా నిలిపివేత

న్యూ డిల్లీ జూలై 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్);అమర్‌నాథ్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేశారు. భారీ వర్షాల కారణంగా జూలై 6వ తేదీ శనివారం గుహ మందిరానికి రెండు మార్గాల్లో అమర్‌నాథ్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. గత రాత్రి నుండి బాల్తాల్, పహల్గాం మార్గాల్లో అడపాదడపా భారీ వర్షాలు కురుస్తుండటంతో యాత్రికుల భద్రత దృష్ట్యా ముందుజాగ్రత్తగా యాత్రను తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు 1.50 లక్షలకు పైగా భక్తులు.. 3,800 మీటర్ల ఎత్తైన గుహ క్షేత్రాన్ని సందర్శించి, సహజసిద్ధంగా ఏర్పడిన మంచు లింగాన్ని దర్శించుకున్నారు. అనంత్‌నాగ్‌లోని నున్వాన్-పహల్గాం మార్గం, గందర్‌బాల్‌లో బల్తాల్ మార్గాల గుండా జూన్ 29న ప్రారంభమైన అమర్‌నాథ్ యాత్ర.. ఆగస్టు 19న ముగుస్తుంది. కాగా, గతేడాది 4.5 లక్షల మంది యాత్రికులు గుహ మందిరాన్ని సందర్శించి ప్రార్థనలు చేశారు. యాత్ర కొనసాగే ప్రాంతాల్లో భారీ వర్షాలు లేకపోయినా.. అమర్‌నాథ్ పవిత్ర గుహకు వెళ్లే కొన్ని ప్రదేశాలలో జల్లులు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. అమర్‌నాథ్ పవిత్ర స్థలంలో ఉష్ణోగ్రతలు గరిష్టంగా 15ఱీఅ వరకు ఉంటాయని.. అయితే రాత్రి సమయంలో ఈ ఉష్ణోగ్రతలు 5ఱీఅకి తగ్గవచ్చని అంచనా వేసింది. చందన్వారి, బాల్తాల్ వద్ద ఉష్ణోగ్రతలు గరిష్టంగా 24-25ఱీఅ వరకు ఉండవచ్చని? రాత్రి ఉష్ణోగ్రతలు 12ఱీఅ వరకు ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెప్పింది.

త్రిపురలో పెరుగుతున్న హెచ్‌ఐవి కేసులు

-ప్రతిరోజూ 5 నుంచి 7 కొత్త కేసులు నమోదవుతున్నాయన్న టిఎస్ఏసిఎస్ - ప్రస్తుతం రాష్ట్రంలో హెచ్‌ఐవీతో బాధపడుతున్నవారి సంఖ్య 5,674

అగర్తలా జూలై 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్); త్రిపురలో హెచ్‌ఐవి కలకలం సృష్టిస్తోంది. రాష్ట్రంలో ఇప్పటి వరకు 47 మంది విద్యార్థులు హెచ్‌ఐవి బారినపడి మృతిచెందారు. మరో 828 మంది విద్యార్థులకు హెచ్‌ఐవి పాజిటివ్‌గా గుర్తించినట్లు త్రిపుర స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (టిఎస్ఏసిఎస్) సీనియర్ అధికారి భట్టాచార్జీ తెలిపారు.ప్రతిరోజూ 5 నుంచి 7 కొత్త కేసులు నమోదవుతున్నాయని వెల్లడించారు.

రాష్ట్రంలో మొత్తంగా హెచ్‌ఐవితో బాధపడుతున్నవారి సంఖ్య 5,674గా ఉందన్నారు. వీరిలో 4,570 మంది పురుషులు, 1,103 మంది మహిళలు, ఒక ట్రాన్స్‌జెండర్ ఉన్నట్లు వెల్లడించారు. సంపన్న కుటుంబాల విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు ఈ మహమ్మారి బారిన పడుతున్నారని తెలిపారు .హెచ్‌ఐవి కేసుల పెరుగుదలకు మాదకద్రవ్యాల దుర్వినియోగమే కారణమని తెలిపారు. సంపన్న కుటుంబాల తల్లిదండ్రులు తమ పిల్లలు మాదకద్రవ్య వ్యసనానికి గురయ్యారని గ్రహించే సమయానికి అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోతుందని భట్టాచార్జీ వివరించారు. త్రిపుర జర్నలిస్ట్ యూనియన్, వెబ్ మీడియా ఫోరమ్, టిఎస్ఏసిఎస్ ఇటీవల సంయుక్తంగా నిర్వహించిన మీడియా వర్క్ షాప్‌లో ఈ పెరుగుతున్న కేసులు తెచ్చారు.ూాంఅూ డేటా ప్రతిరోజూ ఐదు నుండి ఏడు కొత్త ఊఎం కేసులు కనుగొనబడతాయని సూచిస్తుంది. మే 2024 నాటికి, త్రిపురలో 572 మంది విద్యార్థులతో సహా 5,674 మంది హెచ్‌ఐవి ఉన్నవారు సజీవంగా ఉన్నారు.

గందరగోళంగా మారిన జిహెచ్ఎంసి కౌన్సిల్ సమావేశం

-మేయర్ గద్వాల్ విజయలక్ష్మి రాజీనామా చేయాలంటూ బిఆర్ఎస్ కార్పొరేటర్లు నినాదాలు

హైదరాబాద్ జూలై 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స్;గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) కౌన్సిల్ సమావేశం గందరగోళంగా మారింది. ఇటీవల కాంగ్రెస్ లో చేరిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి రాజీనామా చేయాలంటూ బిఆర్ఎస్ కార్పొరేటర్లు నినాదాలు చేశారు. ప్లకార్డులు పట్టుకుని, మేయర్ పోడియం వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో, సమావేశంలో గందరగోళ పరిస్థితి నెలకొంది. బిఆర్ఎస్ కార్పొరేటర్లపై మేయర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించింది బిఆర్ఎస్ పార్టీనే అని మేయర్ మండిపడ్డారు. ఈ అంశంపై నిరసన తెలిపేందుకు బిఆర్ఎస్ కు సిగ్గుండాలని వ్యాఖ్యానించారు. ఆందోళనలు ఆపకపోతే? సమావేశాన్ని నిరవధికంగా వాయిదావేస్తానని హెచ్చరించారు. అయినప్పటికీ పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో? సమావేశాన్ని ఆమె 15 నిమిషాల పాటు వాయిదా వేశారు.మరోవైపు విజయలక్ష్మితో పాటు డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత కూడా బిఆర్ఎస్ తరపునే గెలుపొందారు. ఇటీవలే వారూ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో, వీరిపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు బిఆర్ఎస్ సిద్ధమయింది. ఈ క్రమంలోనే వీరి రాజీనామాకు బిఆర్ఎస్ కార్పొరేటర్లు పట్టుబడుతున్నారు.

కుప్పకూలిన ఆరంతస్తుల భవనం..

న్యూఢిల్లీ, జులై 6 :గుజరాత్‌లో భారీ భవన ప్రమాదం చోటుచేసుకుంది. సూరత్ నగరంలోని సచిన్ ఏరియాలో ఆరంతస్తుల భవనం కుప్పకూలింది. భవన శిథిలాల కింద పలువురు చిక్కుకున్నారని స్థానికులు చెబుతున్నారు.

స్థానికుల ద్వారా ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, సహాయక బృందాలు హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్నాయి.

రెస్క్యూ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. భవన శిథిలాలను తొలగిస్తున్నారు. ఆ నాలుగంతస్తుల భవనంలో పలు కుటుంబాలు నివసిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతానికైతే ప్రాణ నష్టానికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లేవని అధికారులు చెబుతున్నారు.

నేటి కందం- నేటికీ అందం

తరుణ వయస్కులు,బుడుతలు
మరిమరి తినగోరునట్టి మహిమాన్వితమౌ
చిరుతిండిగ భావించుచు
జరుపగ వలయును ప్రపంచ చాక్లెట్ దినమున్

(జూలై 7 ప్రపంచ చాక్లెట్ దినం)



-రాధశ్రీ
సెల్:9494481210

ఇక నుంచి ఏడాదికి రెండు సార్లు టెట్ నిర్వహణ..

తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, జులై 6 : టీచర్ పోస్టులకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ఇక నుంచి ఏడాదికి రెండు సార్లు టెట్(టీచర్ ఎలిజబిలిటీ టెస్ట్) నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి ఏడాది జూన్ నెలలో ఒకసారి, డిసెంబర్ నెలలో మరోసారి టెట్ నిర్వహించనున్నారు. ఇక ఒక అభ్యర్థి ఎన్నిసార్లైనా టెట్ రాసుకోవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే టెట్‌లో ఉత్తీర్ణత సాధించిన వారికే డీఎస్సీ రాసుకునేందుకు అవకాశం కల్పించనున్నారు. టెట్ మార్కులను డీఎస్సీలో వెయిటేజీ ఇవ్వనున్నారు.

గతంలోనే నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్?సీటీఈ) ఏటా రెండుసార్లు టెట్ నిర్వహించాలని రాష్ట్రాలను ఆదేశించిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా టెట్ గడువును జీవితకాలానికి పెంచింది కేంద్ర ప్రభుత్వం. దీంతో ఒక్కసారి క్వాలిఫై అయితే, మరోసారి రాయాల్సిన అవసరం లేదు. టెట్ మార్కులకు డీఎస్సీలో వెయిటేజీ ఉండటంతో కేవలం ఇప్పటికే టెట్ క్వాలిఫై అయిన అభ్యర్థులు తమ స్కోర్ పెంచుకునేందుకు మాత్రమే రాసుకోవచ్చు.

క్షమించడం, క్షమాపణలు కోరడం ఓ సద్గుణం !

(07 జూలై "ప్రపంచ క్షమాగుణ దినం" సందర్భంగా)

ఇతరులను క్షమించడం ఓ గొప్ప గుణమే కాదు మనకు మనశ్శాంతిని తిరిగి బహుమతిగా ఇస్తుంది. ప్రేమ తుది రూపమే క్షమాగుణం. నన్ను నేను సంస్కరించుకునే ఉత్తమ మార్గం ఇతరుల్ని క్షమించి వేయడం. మన పట్ల అనుచితంగా ప్రవర్తించిన వారిని క్షమించడం, ఎవరికైనా మన వల్ల ఇబ్బంది కలిగితే వెంటనే క్షమాపణలు అడగడం ఓ మహత్తర సద్గుణం. క్షమాపణ అనేది ఆధ్యాత్మిక, మానసిక, భావోద్వేగ, శారీరక ఆరోగ్య సాధనకు శక్తివంతమైన సాధనం. క్షమాగుణం ప్రాధాన్యాన్ని గుర్తించి మానవ సమాజం ప్రతి ఏట 07 జూలై రోజున "ప్రపంచక్షమాపణ లేదా క్షమాగుణ దినాన్ని(గ్లోబల్ ఫర్‌గివ్‌నెస్ డే)" పాటించడం సముచితంగా ఉన్నది. కొన్ని దేశాల్లో సెప్టెంబర్ 27న కూడా జాతీయ క్షమాపణ దినం నిర్వహించడం చూస్తున్నాం.

క్షమాగుణం ఓ దివ్య ఔషధం:

క్షమాగుణం మనకు ఓ దివ్య ఔషధంగా పని చేసి మానసిక ఒత్తిడి, భావోద్వేగ నొప్పి, దుఃఖం, గాయాల నుండి ఉపశమనం కలుగజేస్తుంది. క్షమాగుణం ద్వారా కరుణ,దయ,ప్రేమలను బోధిస్తుంది. క్షమించి సంబంధాలను విధిగా కొనసాగించవలసిన అవసరం కూడా ఏమీ ఉండదని గమనించాలి. ఒకరు చేసిన పొరపాటును క్షమించడం అంటే దానిని సమర్థించినట్లు కాదని తెలుసుకోవాలి. క్షమించడం వల్ల ఒకరు గెలిచి మరొకరు ఓడినట్లు కూడా కాదు. క్షమించడం వల్ల కొన్ని సంబంధాలు పునర్‌స్థాపితం కావడంతో పాటు మరింత బలపడవచ్చు కూడా. క్షమించడం లేదా క్షమాపణలు అడగడం ద్వారా మన మనస్సు తేలిక కావడంతో పాటు మనో గాయాల తగ్గింపుకు లేపనంగా కూడా పని చేస్తుంది. క్షమించడం ద్వారా మనల్ని గతం నుంచి వేధిస్తున్న బాధలు తేలిక కావడంతో పాటు మన క్రియాశీలతను పెంచుతుంది.

క్షమాగుణం బహుళ ప్రయోజనాలు:

క్షమాగుణం ఓ అద్భుత సానుకూల నిర్ణయం. క్షమాగుణం కారణంగా పలు అదృశ్య ప్రయోజనాలు కలుగుతాయి. గతంలో మనం చేసిన పొరపాట్లను మనమే క్షమించడం అలవర్చుకోవాలి(సెల్ఫ్ ఫర్‌గివ్‌నెస్). క్షమించవలసిన వ్యక్తిని లోతుగా అర్థం చేసుకోవడానికి ఆస్కారం దొరుకుతుంది. క్షమాగుణంతో కోపం, పగ, చేదు అనుభవాల నుంచి ఉపశమనం కలిగి మానసిక/శారీరక ఒత్తిడి తగ్గుతుంది. క్షమించక పోవడంతో ఆ అనవసర బరువును మన మనసు మోయవలసి వస్తుంది. క్షమించడం వల్ల అనేక దృశ్య, అదృశ్య గాయాలు మానిపోతాయి. క్షమించడంతో గత గాయాలకు చరమగీతం పాడినట్లా అవుతుంది. క్షమించడాన్ని అలవాటు చేసుకున్నపుడు మనలోని ఆందోళనలు తగ్గి రక్త పోటు అదుపులోకి వస్తుంది. క్షమాగుణంతో గుండె బలపడడం, రోగనిరోధకశక్తి పెరగడం, శారీరక నొప్పులు మాయం కావడం కూడా జరుగుతుంది. మన పట్ల ఇతరుల అనుచిత ప్రవర్తనను క్షమించకుండా మనసులో దాచుకున్నపుడు అది మనశ్శాంతిని తొలిచే చెదలుగా కూడా మారుతుంది.

క్షమించడం, క్షమాపణలు కోరడం బలహీనత కాదని, ఆ సద్గుణం మనకున్న బలమైన శక్తి అని తెలుసుకుందాం. నేటి నుంచైనా క్షమాగుణాన్ని ఆచరించడానికి ప్రయత్నాలు చేద్దాం. క్షమించడానికి అర్హత కలిగిన వ్యక్తులను నేటి నుంచే క్షమించి ఆరోగ్యంగా, ఉల్లాసంగా అడుగులు వేద్దాం. క్షమాగుణం శక్తిని పలువురికి అవగాహన పరుద్దాం.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

తెలంగాణ ఇంధన భద్రత అవసరాల బలోపేతానికి చర్యలు తీసుకుంటున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ, జులై 6 :ఏడాదికి 10 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ఒడిశాలోని నైని బొగ్గు గనిని ఎస్సీసీఎల్ థర్మల్ పవర్ ప్లాంట్ లో క్యాప్టివ్ వినియోగం కోసం 13.08. 2015న సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్సీసీఎల్)కు కేటాయించారు. అక్టోబర్ 2022 లో స్టేజ్-2 అటవీ అనుమతులు పొందిన తర్వాత అటవీ భూమిని అప్పగించడంలో జరిగిన అసాధారణ జాప్యం వల్ల ఈ గనిలో పనులు ప్రారంభం కాలేదు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత శ్రీ జి.కిషన్ రెడ్డి నైని బ్లాక్‌కు సంబంధించి ఒడిశా ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో నైని బ్లాక్‌లో బొగ్గు ఉత్పత్తి ప్రారంభం కావాల్సిన అవసరం, సహకార సమాఖ్య స్ఫూర్తికి అనుగుణంగా దీనిపై త్వరగా నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం తదితర అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. ఫలితంగా 643 హెక్టార్ల అటవీ భూమిని ఎస్సీసీఎల్ కు అప్పగించేందుకు 04.07.2024న ఆమోదం లభించింది. ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించినందుకు ఒడిశా ముఖ్యమంత్రి శ్రీ మోహన్ చరణ్ మాంఝీకి కిషన్ రెడ్డి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.త్వరలోనే ఈ గని నుంచి ఎస్సీసీఎల్ ఉత్పత్తిని ప్రారంభించే అవకాశం ఉంది. ఈ చర్య తెలంగాణ ఇంధన భద్రత అవసరాలను మరింత బలోపేతం చేస్తుంది మరియు భద్రపరుస్తుంది.

అందరి సహకారంతో జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తాం.. కలెక్టర్

కడప జులై 6 : రాష్ట్ర ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారుల సమన్వయ సహకారంతో, జిల్లా ప్రజల అభిమానంతో జిల్లాను అన్నిరంగాల్లో ముందుకు నడిపించేందుకు కృషి చేస్తామని.. వైఎస్ఆర్ జిల్లా నూతన కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. శనివారం ఉదయం జిల్లా కలెక్టరేట్ కు చేరుకున్న ఆయన.. కలెక్టర్ చాంబర్ లో వేద పండితులు ఆశీర్వచనాలు అందించగా.. ఉదయం 11గంటల సమయంలో వైఎస్ఆర్ జిల్లా కలెక్టర్ గా బాధ్యతలను స్వీకరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా, ప్రజలు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారుల సహకారంతో.. కలెక్టర్ గా.. కర్తవ్య నిబద్ధతతో ఉద్యోగ ధర్మాన్ని నెరవేరుస్తూ జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను.. ప్రజలకు సంతృప్త స్థాయిలో అందేలా కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. అనంతరం పలువురు జిల్లా అధికారులు, ప్రముఖులు, పాత్రికేయులు, తదితరులు పుష్ప గుచ్చాలతో స్వాగతం పలికి జిల్లా కలెక్టర్ కు తమ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీ గణేష్ కుమార్, కడప నగర కమిషనర్ జి.ఎస్.ఎస్. ప్రవీణ్ చంద్, డిఆర్వో గంగాధర్ గౌడ్, పలువురు జిల్లా స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐజీహెచ్‌టీ పథకం(మొదటి విధానం, రెండో విడత) కింద గ్రీన్ హైడ్రోజెన్ అమలు కోసం పథక మార్గదర్శకాలు జారీ

న్యూఢిల్లీ, జులై 6 :'స్ట్రాటజిక్ ఇంటర్వెన్షన్స్ ఫర్ గ్రీన్ హైడ్రోజెన్ ట్రాన్సిషన్(ఎస్ఐజీహెచ్‌టీ) కార్యక్రమం - కాంపొనెంట్ ఎఎ: హరిత ఉదజని(గ్రీన్ హైడ్రోజెన్) ఉత్పత్తి(మోడ్ 1 కింద)- విడత-ఎఎ కోసం ప్రోత్సాహక పథకం' అమలుకు సంబంధించిన మార్గదర్శకాలను కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన శాఖ(ఎంఎన్ఆర్ఈ) జూలై 3, 2024 నాడు ప్రకటించింది.

విడత-ఎఎలో 4,50,000 టీపీఏ హరిత ఉదజని సామర్థ్యం ఉండనున్నది. ఇందులో 40,000 టీపీఏ సామర్థ్యం బయోమాస్ ఆధారిత మార్గాలకు(బకెట్-ఎఎ)కి ప్రత్యేకంగా కేటాయించగా, మిగతాది ఇతర సాంకేతికత ఆధారిత మార్గాలు (బకెట్-ఎ) కేటాయిస్తారు. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఈసీఐ) ఈ విడత కార్యక్రమాన్ని అమలు చేసే సంస్థగా బాధ్యత వహించనుంది. త్వరలోనే రిక్వెస్ట్ ఫర్ సెలక్షన్(ఆర్ఎఫ్ఎస్)ను ఎస్ఈసీఐ జారీ చేయనుంది.

వేలందారు పేర్కొన్న కనీస సగటు ప్రోత్సాహకం ఆధారంగా వేలం నిర్వహిస్తారు. బకెట్-ఎ కింద కనిష్ట బిడ్ 10,000 టీపీఏ కాగా గరిష్ట బిడ్ 90,000 టీపీఏగా ఉంటుంది. బకెట్-ఎఎలో కనిష్ట బిడ్ సామర్థ్యం 500 టీపీఏ కాగా గరిష్ట సామర్థ్యం 4000 టీపీఏ. వేలంలో పాల్గొనేవారు రెండింటికీ లేదా ఏదైనా ఒక బకెట్‌కు పాల్గొనవచ్చు. ఈ విడతలో ఒక్కరికి గరిష్ట సామర్థ్యంగా 90,000 టీపీఏ వరకు కేటాయిస్తారు.జాతీయ హరిత ఉదజని మిషన్‌ను 2029-30 ఆర్థిక సంవత్సరం వరకు చేపట్టేలా రూ.19,744 కోట్ల వ్యయంతో జనవరి 4, 2023లో ప్రారంభించారు. స్వచ్ఛ ఇంధనం ద్వారా ఆత్మ నిర్భర్(స్వయం సమృద్ధి) సాధించాలనే, ప్రపంచ స్వచ్ఛ ఇంధన పరివర్తనకు ఆదర్శంగా నిలవాలనే భారతదేశ లక్ష్యానికి ఇది దోహదపడుతుంది. ఆర్థిక వ్యవస్థలో డీకార్బనైజేషన్ కోసం, శిలాజ ఇంధనాల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు, హరిత ఉదజనిలో కొత్త సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు, మార్కెట్ లీడర్‌గా మారేందుకు ఈ మిషన్ తోడ్పడనుంది.

హైవేల్లో పార్థి గ్యాంగ్ ఆగడాలు - 24/7 దోపిడీలు

-ఇదీ పార్థీ గ్యాంగ్ పని
-మహారాష్ట్ర ముఠాగా గుర్తింపు
-ఇద్దరు నిందితుల అరెస్టు
-మరో ముగ్గురు కోసం గాలింపు
-వివరాలు వెల్లడించిన నల్గొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్లగొండ , జులై 6 : : జాతీయ రహదారిలో దోపిడీలకు పాల్పడుతున్న పార్థి గ్యాంగ్‌కు సంబంధించి ఇద్దరు సభ్యులను అరెస్టు చేయగా, మరో ముగ్గురి కోసం గాలిస్తున్నామని ఎస్పీ శరత్ చంద్ర

పవార్ తెలిపారు. శుక్రవారం తెల్లవారు జామున పెద్ద అంబర్‌పేట వద్ద పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపి పట్టుకున్న విషయం విదితమే. వారిని ఈరోజు అరెస్ట్ చేసినట్లు ప్రకటించారు. అలాగే నిందితుల నుంచి ఒక స్క్రూ డ్రైవర్, రెండు కత్తెరలు, రూ .17 వేల నగదు, ఒక జత వెండి పట్టీలు, ఒక టార్చ్ లైట్ స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నల్గొండ జిల్లా, హైదరాబాద్ నగర పరిధి సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ పరిధిలో దోపిడీలకు పాల్పడుతున్నారన్నారు. కట్టంగూర్ పీఎస్ పరిధిలో డబ్బుల కోసం ఓ లారీ డ్రైవర్ ను హత్యచేశారని చెప్పారు. తెలంగాణ వ్యాప్తంగా వీరిపై 32 కేసులు ఉన్నాయని తెలిపారు. ఈ గ్యాంగ్ మహారాష్ట్రకు చెందిన ముఠా అని చెప్పారు. వీరు ఎక్కడా విశ్రాంతి తీసుకోకుండా 24/7 దోపిడీలపై ఫోకస్ పెడతారన్నారు. దొంగలించిన అభరణాలను మహారాష్ట్రలో విక్రయిస్తుంటారని చెప్పారు.

వైభవంగా ప్రారంభమైన అమ్మవారి ఆషాడ మహోత్సవాలు..

-తొలిసారి సమర్పించిన వైదిక కమిటీ
-ఉత్సవ శోభ సంతరించుకున్న ఇంద్రకీలాద్రి..

అమరావతి, జులై 6 :ఇంద్రకీలాద్రి సరికొత్త ఉత్సవ శోభను సంతరించుకుంది. విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీ దుర్గా

మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో కొలువై ఉన్న కనకదుర్గమ్మ వారి ఆషాడ మహోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రతి ఏడాది ఆషాడ మాసంలో అమ్మవారికి సారె సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ క్రమంలో ఇంద్రకీలాద్రిపై శనివారం నుండి ఆషాడమాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. అమ్మవారికి తొలి సారెను ఆలయ వైదిక కమిటీ సభ్యులు సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు సమర్పించిన అనంతరం ఆలయ మహా మండపం ఆరవ అంతస్తులో ఉన్న అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు అనంతరం ప్రత్యేక సారెను సమర్పించారు.

అమ్మవారికి భక్తుల సారే సమర్పణకు ప్రత్యేక ఏర్పాట్లను దేవస్థానం అధికారులు చేశారు. అలాగే శనివారం నుండి 16వ తేదీ వరకు ఇంద్రకీలాద్రిపై మొదటిసారి వారాహి నవరాత్రులు కూడా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఈ ఓ కే ఎస్ రామారావు మాట్లాడుతూ వచ్చే నెల 6 నుంచి నెలరోజుల పాటు ఇంద్రకీలాద్రిపై ఆషాఢ మాస సారె మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

భక్తులు అమ్మవారికి సారె సమర్పించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. వచ్చే నెల 19 తేదీ నుంచి మూడు రోజుల పాటు ఇంద్రకీలాద్రిపై శాకాంబరి దేవి ఉత్సవాలు నిర్వహిస్తునట్లు చెప్పారు. ఇంద్రకీలాద్రిపై మొట్టమొదటి సారిగా వారాహి ఉత్సవాలు నిర్వహిస్తునట్లు ప్రకటించారు.

ఈ ఉత్సవాలు జులై 6 నుంచీ 15వరకు జరుగుతాయన్నారు. వారాహి ఉపాసన, హోమం, హవనం, చండీ పారాయణ, రుద్రహోమం వారాహి నవరాత్రుల్లో జరుపుతామన్నారు. 14న తెలంగాణా మహంకాళీ ఉత్సవ కమిటీ బోనాలు తీసుకొచ్చి అమ్మవారికి బోనం సమర్పిస్తారని చెప్పారు. ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ అంతకంతకు పెరుగుతుందని, మధ్యాహ్నం మహానివేదన సమయంలో సామాన్య భక్తులు అధిక సంఖ్యలో వేచి ఉంటున్నారనీ, ఆ సమయంలో ప్రోటోకాల్ దర్శనాలు ఆపాలని నిర్ణయించినట్లు తెలిపారు. 11:45 నుంచి 12:15 వరకూ మహానివేదన ఉంటుందని, 11:30 నుంచీ 1:30 వరకూ ప్రోటోకాల్ దర్శనాలు ఉండవని ప్రకటించారు. సామాన్య భక్తులకు దర్శనంలో ఆటంకం కలగకూడదనే ప్రోటోకాల్ దర్శనాలు నిలిపివేసినట్లు ప్రకటించారు.

రైల్వేలో 18,799 అసిస్టెంట్ లోకోమోటివ్ డ్రైవర్ల పోస్టులు

హైదరాబాద్, జులై 6 :ఉద్యోగార్థులకు రైల్వే శాఖ శుభవార్త అందించింది. గత ఏడాది జనవరిలో వివిధ రైల్వే జోన్లలో లోకోమోటివ్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి ఆర్ ఆర్ బి ఉద్యోగ ప్రకటన విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ నోటిఫికేషన్ లో 5,696 ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి. ఇవి కాకుండా దేశంలోని వివిధ రైల్వే జోన్లలో మొత్తం 18,799 అసిస్టెంట్ లోకోమోటివ్ డ్రైవర్ల పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి ప్రతి జోన్ లో ఉన్న ఖాళీల గురించి సమాచారం తెలిసింది. దీని ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వే జోన్ పరిధిలో 2528 ఖాళీలు ఉన్నాయి. ఇక బిలాస్ పూర్ జోన్ లో అత్యధికంగా 4435 ఖాళీలు ఉన్నాయి. దరఖాస్తు చేసుకోవాల్సిన అభ్యర్థులు మరింత సమాచారం కోసం వెబ్‌సైట్‌ను క్రమం తప్పకుండా చూడాలని ఆర్ ఆర్ బి కోరింది. అభ్యర్థులు అబ-1 స్టేజ్ 1, అబ-2 స్టేజ్ 2, కంప్యూటర్ బేస్డ్ ఆప్టిట్యూడ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక చేయనున్నారు.

ఈ పోస్టులకు ఎంపికైన వారికి నెలకు రూ. 19,900 నుండి రూ. 63,200 వరకు జీతం అందిస్తుంది రైల్వే. ఇక దేశవ్యాప్తంగా ఉన్న అహ్మదాబాద్, అజ్మేర్, బెంగళూరు, ముజఫర్‌పూర్, పట్నా, ప్రయాగ్‌రాజ్, రాంచీ, సికింద్రాబాద్, సిలిగురి, భోపాల్, భువనేశ్వర్, బిలాస్‌పూర్, చండీఘడ్, చెన్నై, గువాహటి, జమ్ము అండ్ శ్రీనగర్, కోల్‌కతా, మాల్దా, ముంబయి, తిరువనంతపురం, గోరఖ్‌పూర్ రీజియన్లలో ఉద్యాగాలు భర్తీ కానున్నాయి.

ఇక అభ్యర్థులు ఈ విషయంలో తదుపరి ప్రకటన కోసం ఫ్ట్రబిబిజూబ:/ /లిలిలి.తీతీఎఇటణ.ఐనీల.తిని/ అనే వెబ్‌సైట్‌ను చెక్ చేసుకుంటూ ఉండాలని తెలిపింది. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలనుకున్న అభ్యర్థులు సంబంధిత విభాగంలో ఐటీఐ పూర్తి చేసి ఉండాలి.

స్టాప్ డయేరియా (అతిసారవ్యాధి నిరోధక) జాతీయ ప్రచారంతో చేతులు కలిపిన రక్షిత మంచినీరు, పారిశుధ్య విభాగం

న్యూఢిల్లీ, జులై 6 :రక్షిత మంచినీరు ఉపయోగించడాన్ని, గ్రామ, పంచాయతీ స్థాయిలలో పారిశుధ్య పద్ధతులను అనుసరించడాన్ని ప్రోత్సహించేందుకు 1 జులై 2024 నుంచి స్వచ్ఛ గాంవ్, శుద్ధ్ జల్ - బెహతర్ కల్ (స్వచ్ఛ గ్రామం -రక్షిత నీరు - మెరుగైన భవిష్యత్తు)నినాదంతో రెండు నెలల అవగాహనా ప్రచారాన్ని ప్రారంభించిన డిడిడబ్ల్యుఎస్ గ్రామీణ పారిశుధ్య మిషన్- జాతీయ స్టాప్ డయేరియా ప్రచారం మధ్య సమన్వయం ప్రజారోగ్యం పట్ల దృఢసంకల్పాన్ని నొక్కి చెప్తుంది శ్రీ సి.ఆర్. పాటిల్

న్యూఢిల్లీ, 5 జులై (పిఐబి): కేంద్ర ఆరోగ్య మంత్రి శ్రీ జె.పి. నడ్డా, కేంద్ర సహాయమంత్రులు, కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర/ కేంద్రపాలిత ప్రాంతాల సీనియర్ అధికారులు, అభివృద్ధి భాగస్వాముల ప్రతినిధులతో కలిసి 24 జూన్ 2024న ప్రారంభించిన జతీయ స్టాప్ డయేరియా ప్రచారంతో జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధీనంలోని రక్షిత మంచి నీరు - పారిశుధ్య విభాగం (డిడిడబ్ల్యుఎస్) చేతులు కలిపింది.

ఈ భాగస్వామ్యం ప్రాముఖ్యతను కేంద్ర జలశక్తి మంత్రి శ్రీ సి.ఆర్. పాటిల్ ఉద్ఘాటించారు. గ్రామీణ పారిశుధ్య మిషన్, జాతీయ స్టాప్ డయేరియా ప్రచారం మధ్య సమన్వయం ప్రజారోగ్యం పట్ల మా తిరుగులేని నిబద్ధతను నొక్కి చెప్తుంది. ఈ సమిష్టి కృషి ద్వారా, బాలల మరణాలను తగ్గించడమే కాకుండా గ్రామీణ భారతంలో ఆరోగ్యం, పారిశుధ్య సంస్కృతిని ప్రోత్సహించడాన్ని మేము లక్ష్యంగా పెట్టుకున్నాం, అని ఆయన వివరించారు.

డిడిడబ్ల్యుఎస్ కార్యదర్శి విని మహాజన్ మాట్లాడుతూ, మన పిల్లల, సమూహాల ఆరోగ్యాన్ని పరిరక్షించే దిశలో ఈ చొరవ కీలకమైందంటూ తన నిబద్ధతను ప్రకటించారు. జాతీయ స్టాప్ డయేరియా ప్రచారంతో తమ కృషిని సమన్వయం చేయడం ద్వారా, అతిసార వంటి నివారించగలిగిన వ్యాధులతో పిల్లలు మరణించకుండా నిరోధించడం తమ లక్ష్యమన్నారు. ఈ లక్ష్యాన్ని సాధించడం కోసం రక్షిత మంచినీరు, పారిశుధ్యం పై తాము దృష్టి పెట్టడం కీలకమన్నారు.

రెండు నెలల కాలంలో సమగ్రమైన, బహుళ క్షేత్ర విధానాన్ని అనుసరిస్తూ బాలల మరణాన్ని పూర్తిగా అరికట్టాలన్నది జాతీయ స్టాప్ డయేరియా ప్రచార లక్ష్యం.

కీలకంగా దృష్టి పెట్టె అంశాలు-

ఆరోగ్య మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం: ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతాలలో ఆరోగ్య కేంద్రాల నిర్వహణ, అత్యవసర వైద్య సరఫరాల (ఓఆర్ఎస్, జింక్) పంపిణీకికు హామీ.

రక్షిత నీరు, పారిశుధ్యం మరింత అందుబాటులోకి తేవడం: రక్షిత మంచినీరు, పారిశుధ్యానికి నిలకడైన, స్థిరమైన నాణ్యతా ప్రమాణాల నియంత్రణతో పద్ధతులు పాటించడం

పౌష్టికాహార కార్యక్రమాలు పెంపు: అతిసార వ్యాధుల నిరోధానికి పోషకాహార లోపాన్ని సవరించేందుకు చర్యలు

పారిశుధ్య విద్యకు ప్రోత్సాహం: పాఠశాలల్లో అవసరమైన సౌకర్యాలను అందించడం, పారిశుధ్యం గురించి పిల్లలలో అవగాహన పెంచడం

ఈ చొరవకు పూరకంగా, 1జులై నుంచి 31 ఆగస్టు 2024వరకు స్వచ్ఛ గాంవ్, శుద్ధ జల్ - బెహర్‌కల్ నినాదంతో రక్షిత నీరు, పారిశుధ్యంపై అవగాహనా ప్రచారాన్ని డిడిడబ్ల్యుఎస్ ప్రారంభించింది. గ్రామ, పంచాయతీ స్థాయిలో అవగాహనను పెంచడం, రక్షిత నీరు, పారిశుధ్య పద్ధతులను అనుసరించేందుకు ఈ ప్రచారాన్ని రూపొందించింది.

అతిసార వ్యాధి కారణంగా బాల్యంలో మరణాలను తగ్గించడం, సంపూర్ణ స్వాస్థ్య, స్వచ్ఛ భారత్ దిశగా గ్రామాలు బహిర్గత మలవిసర్జన రహిత ప్లస్ నమూనా హోదాను నిలకడగా సాధించడాన్ని సమర్థిస్తూ, గ్రామీణ భారతంలో సంపూర్ణ ప్రజారోగ్యాన్ని మెరుగుపరచడమనే లక్ష్యంతో ప్రారంభించిన జాతీయ స్టాప్ డయేరియా ప్రచారం ఈ కృషి దోహదం చేస్తుంది.

కీలక ప్రచార కార్యకలాపాలు:

సామాజిక భాగస్వామ్యం: గ్రామీణ జల, పారిశుధ్య కమిటీలు, నీటి సమితులు, స్థానిక సంస్థలు కలిసి సమాజంలోని అన్ని వర్గాలు ఇందులో పాలుపంచుకుని, పూర్తి స్థాయిలో భాగస్వాములను చేసేందుకు కృషి చేస్తాయి.

నీటి నాణ్యత పరీక్షలు: ఫీల్డ్ టెస్ట్ కిట్‌ల ద్వారా క్రమం తప్పకుండా నీటిని పరీక్షించడం, ఎడబ్ల్యుసి, పాఠశాలలు, ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు, కమ్యూనిటీ సెంటర్లలో ఫలితాలను ప్రదర్శించడం.

చైతన్యం కోసం వర్క్‌షాప్‌లు: స్థానిక సమూహాలు, ప్రభుత్వ అధికారులు, ఇతర భాగస్వాములకు జల నిర్వహణ, పారిశుధ్యం, పరిశుభ్రతను ప్రోత్సహించడంలో జిల్లా జల, పారిశుధ్య మిషన్లు శిక్షణనిస్తాయి.

లీకేజీలను గుర్తించి, మరమ్మత్తుల చర్యలు: కాలుష్యాన్ని నివారించేందుకు, జల సంరక్షణకు జల సరఫరా వ్యవస్థల తనిఖీ, మరమ్మత్తులు

ప్రజావగాహనా ప్రచారాలు: పరిశుభ్రమైన మంచినీరు, పరిశుభ్రత కోసం రక్షిత పారిశుధ్య పద్ధతులు, ఐహెచ్‌హెచ్ఎల్/ సిఎస్‌సి వినియోగం, నీటిద్వారా సంక్రమించే వ్యాధులను నిరోధించడంబలహీనవర్గాలపై

ప్రత్యేక దృష్టి: అతిసార, ఇతర నీటి సాంక్రమిక వ్యాధుల ఘటనలను తగ్గించేందుకు ఐదేళ్ళ వయసు లోపు పిల్లలను, వృద్ధులను లక్ష్యంగా చేసుకోవడం

విద్యా చొరవలు: బాలింతలు, కౌమారంలో ఉన్న బాలికలకు సరైన పారిశుధ్యం, ఆరోగ్యవంతమైన పద్ధతులతో పాటు చిన్న పిల్లల మలవిసర్జనను సరైన పద్ధతిలో పారవేయడం, చేతుల పరిశుభ్రతపై వర్క్‌షాప్‌లు, శిక్షణా సెషన్ల నిర్వహణ

దశలవారీ అమలు

వారాలు 1ఓ2 : ప్రచార కార్యక్రమం ప్రారంభం, సమైక్య సమావేశాలు, నీటి నాణ్యత పరీక్షించడం, అవగాహన సదస్సులు

వారాలు 3ఓ4 : గ్రామీణ పారిశుధ్యం కోసం లీకేజీని గుర్తించి, మరమ్మత్తుల చర్యలు, ప్రజావగాహనా ప్రచారాలు, పారిశుధ్య డ్రైవ్‌లు , సంస్థలలో సబ్బుతో చేతులు కడుక్కొనే సౌకర్యానికి హామీ.

వారాలు 5ఓ6 : క్లోరిన్ పరీక్ష, ప్రజావగాహనా ప్రచారాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రత్యేక దృష్టితో సాధారణ వాడుకనీటి నిర్వహణ (గ్రీన్ వాటర్), పని చేయని మరుగుదొడ్ల నిర్వహణ

వారాలు 7ఓ8: స్థానిక సమాజాలతో కలవడం, వర్షపు నీటి నిల్వ, ఆవాసాలలో వ్యక్తిగత మరుగుదొడ్ల (ఐహెచ్‌హెచ్ఎల్) కోసం ప్రత్యేక డ్రైవ్‌లు, సామాజిక పారిశుధ్యం భవనం (సిఎస్‌సి) నిర్మాణం, ఆరోగ్యం కోసం రక్షిత మంచినీటిపై ఇంటింటికీ కరపత్రాలు పంచడం

తోటకనుమలో విషజ్వరాలు.. మహిళ మృతి..

చిత్తూరు,, జులై 6 :మండల పరిధిలోని తోటకనుమ పంచాయితీలో విషజ్వరాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గత వారం రోజులుగా పంచాయితీలోని అన్ని పల్లెలో ఎటుచూసినా జ్వర బాధితులే కంట పడుతున్నారు. శుక్రవారం తోటకనుమకు చెందిన గంగరాజు భార్య స్వాతి (20) విషజ్వరంతో మృతి చెందింది. ఆమె ఎనిమిది నెలల చిన్నారికి జ్వరం కారణంగా పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు కుప్పం పీఈఎస్ వైద్య కళాశాలకు తరలించారు. గ్రామంలో ప్రతి ఇంట్లోను జ్వరాలతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకుంటున్నా.. జ్వరాలు అదుపుకావడం లేదు. గ్రామంలో ఏఎన్ఎం లు రచ్చ వద్దకు వచ్చి కాలక్షేపం చేసి వెళ్ళుతున్నారే తప్పా కనీసం వైద్య శిబిరం ఏర్పాటు చేయలేదని గ్రామస్తులు వాపోతున్నారు.

పల్లెల్లో పారిశుధ్యం లోపించడం వల్లే జ్వరాలు ప్రబలినట్లు తెలుస్తోంది. కార్యదర్శికి జ్వరాలపై తెలిపినా పారిశుధ్యం పై దృష్టి సారించలేదు. వైద్య ఆరోగ్య శాఖ జ్వరాలను అదుపు చేసేందుకు తక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంది. అక్కడి సర్పంచ్ ను వివరణ కోరగా.. పంచాయతీలో నిధులు లేకపోవడంతో మురుగు కాలువలు శుభ్రం చేయలేక పోయామని వాపోయారు. కనీసం మండల నిధులేమైనా ఇస్తారా అంటే ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుండి ఎంపీపీ యువరాజ్ అందుబాటులో లేరన్నారు. కావున మెడికల్ అధికారులు తోటకనుమలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయకపోతే జ్వరాలు విజృంభించడం ఖాయమన్నారు.

బస్సు బోల్తా.. ఇద్దరు మృతి.. నలుగురికి తీవ్రగాయాలు..

చిత్తూరు,, జులై 6 :పలమనేరు నియోజకవర్గ పరిధిలోని పెద్దపంజాణి మండలం బసవరాజ కండ్రిగ వద్ద అనంతపూర్ నుండి రామేశ్వరంకు వెళుతున్న బస్సు బసవరాజు కండ్రిగ వద్ద ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి బోల్తా పడ్డ సంఘటన జరిగింది. పలు పుణ్యక్షేత్రాలను సందర్శించడానికి అందులో ప్రయాణిస్తూ కాణిపాకం ఆలయానికి వెళుతుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఇందులో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా.. మరో నలుగురు తీవ్ర గాయాలపాలయ్యారు.

వీరిని పలమనేరు ప్రభుత్వాసుపత్రి నుండి చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించారు. కాగామొత్తం 21 మందికి గాయాలైనట్లు సమాచారం. ఈ మేరకు పెద్దపంజాణి పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పలమనేర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతిచెందిన వారిలో తుంకూర్ డిస్టిక్ కర్ణాటక రాష్ట్రం మురార మనహళ్లికి చెందిన లేట్ దేవారెడ్డి కుమారుడు నరసింహారెడ్డి.. సత్యసాయి జిల్లా పెనుగొండ తాలూకా రోద్దం మండలం చిన్న గువ్వలపల్లి గ్రామానికి చెందిన తిమ్మారెడ్డి భార్య రామాంజమ్మలు ఉన్నారు.

కిన్నెర ఆర్ట్ థియేటర్స్
హైదరాబాద్
ఆహ్వానం
శ్రీ కొక్కుల శివకృష్ణ
రచించిన
సముద్ర నానీలు
గ్రంథావిష్కరణ

ఆదివారం 07-07-2024
ఉదయం 10 గంటలకు
రవీంద్రభారతి సమావేశ మందిరం,
మొదటి అంతస్తు, హైదరాబాదు

ముఖ్యఅతిథి - ఆవిష్కర్త
డా॥ ఎన్. గోపి
పూర్వ వైస్ ఛాన్సలర్, తెలుగు విశ్వవిద్యాలయం
కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత
సభాధ్యక్షులు
ఆచార్య సూర్యా ధనంజయ
పూర్వ అధ్యక్షులు, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం
విశిష్ట అతిథులు :
డా॥ పోరెడ్డి రంగయ్య
ప్రముఖ కవి, వ్యాఖ్యాత
శ్రీ కుడికాల వంశీధర్
ప్రముఖ కవి, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్
గౌరవ అతిథులు
శ్రీ సుంకరి కృష్ణ ప్రసాద్, ప్రముఖ కవి
శ్రీ చిత్తలూరి సత్యనారాయణ, ప్రముఖ కవి
డా॥ ఆర్. ప్రభాకరరావు, ఐ.పి.ఎస్. (రి) అధ్యక్షులు
మద్దాళి రఘురామ్ కార్యదర్శి

స్టెయిన్‌లెస్ స్టీల్ మరియు అల్యూమినియం పాత్రలకు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్) ఆమోదం తప్పనిసరి

న్యూఢిల్లీ, జులై 6 :వంటగది భద్రత, నాణ్యత మరియు సమర్థతను పెంపొందించడానికి గానూ స్టెయిన్‌లెస్ స్టీల్ మరియు అల్యూమినియం పాత్రలకు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్) ఆమోదముద్ర తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కేంద్ర వాణిజ్య మరియు పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలోని పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం(డీపీఐఐటీ) మార్చి 14, 2024న నాణ్యత నియంత్రణ ఉత్తర్వు జారీ చేసింది. దీని ప్రకారం స్టెయిన్‌లెస్ స్టీల్, అల్యూమినియం పాత్రలకు ఐఎస్ఐ ముద్ర తప్పనిసరి. ఇది పాటించకపోవడం శిక్షార్హం. వినియోగదారుల భద్రత మరియు ఉత్పత్తుల నాణ్యత పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధిని ఈ నిర్ణయం నొక్కి చెప్తున్నది.

ఇటీవల నిత్యావసర వంటగది వస్తువులకు సంబంధించి బీఐఎస్ తగు ప్రమాణాలను రూపొందించింది. వంట పాత్రలు నిర్దేశిత ప్రమాణాలకు తగ్గట్టుగా ఉండేలా, నాణ్యత, భద్రతా ప్రమాణాలను పాటించేలా ఇవి ఉన్నాయి. వీటిని పరిచయం చేయడం ద్వారా వినియోగదారుల భద్రతను, ఉత్పత్తుల అత్యున్నత పనితీరును ప్రోత్సహిస్తూనే వంట పద్ధతుల్లో సాంస్కృతిక వైవిధ్యాన్ని కాపాడాలని బీఐఎస్ లక్ష్యంగా పెట్టుకున్నది.

స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలు: మన్నికైనవి మరియు ఆకర్షణీయమైనవి

మన్నిక, వంటలకు అనుకూలంగా ఉండటం, చూడటానికి ఆకర్షణీయంగా కనిపించడం వంటి కారణాల వల్ల ప్రపంచవ్యాప్తంగా వంటగదుల్లో చాలా కాలంగా స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలను ఎక్కువగా వినియోగిస్తున్నారు. క్రోమియంతో పాటు నికెల్, మాలిబ్డినమ్ మరియు మాంగనీస్ వంటి లోహాలతో ఉక్కును మిశ్రమంగా చేసి తయారుచేసే స్టెయిన్‌లెస్ స్టీల్.. తుప్పు నిరోధకత, బలమైన యాంత్రిక లక్షణాలకు ప్రసిద్ధి గాంచింది. బీఐఎస్ ఈ లక్షణాలను భారతీయ ప్రమాణాలు ఐఎస్ 14756:2022గా క్రోడీకరించింది. వంట చేయడం, వడ్డించడం, భోంచేయడం మరియు నిల్వ చేయడానికి గానూ వేర్వేరు రకాల పాత్రలకు సంబంధించిన అవసరమైన ప్రమాణాలను ఇవి స్పష్టం చేస్తున్నాయి.

బరువు తక్కువగా ఉండే స్వభావం, ఉష్ణవాహక గుణం, చౌకగా లభించడం మరియు మన్నికైనవి కావడం వల్ల గృహాలతో పాటు వృత్తిపరమైన వంటశాలల్లో అల్యూమినియం పాత్రలు కూడా ఎక్కువగా వినియోగంలో ఉన్నాయి. వీటికి సంబంధించి బీఐఎస్ ఇండియన్ స్టాండర్డ్ ఐఎస్ 1660:2024ను రూపొందించింది. ఇది ప్లాస్టిక్ పూతతో కూడిన నాన్-స్టిక్ మరియు కఠినమైన ఆక్సైడ్ పూత కలిగిన 30 లీటర్ల సామర్థ్యం వరకు ఉన్న అల్యూమినియం పాత్రలకు సంబంధించిన తయారీ ప్రమాణాలను నిర్దేశిస్తున్నది. సామాగ్రి అత్యధిక నాణ్యత మరియు పనితీరు ఉండేలా ఈ ప్రమాణాలు దోహదపడతాయి.

స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రల తరహాలోనే అల్యూమినియం పాత్రలకు కూడా మార్చి 14, 2024 నాటి నాణ్యత నియంత్రణ ఉత్తర్వు ప్రకారం ధ్రువీకరణ తప్పనిసరి. తద్వారా బీఐఎస్ ప్రమాణాలకు తగ్గట్టుగా లేని, బీఐఎస్ ముద్ర లేని అల్యూమినియం పాత్రలు ఎవరూ తయారుచేయకుండా, దిగుమతి చేసుకోకుండా, విక్రయించకుండా, సరఫరా చేయకుండా, నిల్వ చేయకుండా, అద్దెకు ఇవ్వకుండా, లీజుకు ఇవ్వకుండా, అమ్మడానికి ప్రదర్శించకుండా చూడవచ్చు. ఇవి ఉల్లంఘిస్తే చట్టపరంగా జరిమానాలు విధించవచ్చు. ప్రజా ఆరోగ్య భద్రత ప్రాముఖ్యతను తెలియజేయడానికి మరియు వంటగది ఉత్పత్తులపై నమ్మకాన్ని కాపాడేందుకు ఇది ఉపయోగపడుతుంది.

నాణ్యత మరియు వినియోగదారుల విశ్వాసానికి పూచీ

దేశవ్యాప్తంగా గృహాలు మరియు వృత్తిపరమైన వంటగదుల్లో ఉపయోగించే వంటపాత్రలు అత్యధిక భద్రత మరియు నాణ్యతతో ఉండేలా పూచీ కల్పించేందుకు గానూ బీఐఎస్ ఒక కీలకమైన అడుగు వేస్తూ స్టెయిన్‌లెస్ స్టీల్ మరియు అల్యూమినియం పాత్రలకు సంబంధించి ఈ కఠినమైన ప్రమాణాలను రూపొందించింది. కఠినమైన పరీక్షలు జరపడం మరియు ధ్రువీకరించే ప్రక్రియను అమలు చేయడం ద్వారా వినియోగదారులను నాసిరకం ఉత్పత్తుల నుంచి బీఐఎస్ కాపాడుతుంది. వంటపాత్రలు వినియోగించడానికి సురక్షితమైనవని మరియు మన్నికతో ఉండేలా తయారుచేసినవని పూచీని కల్పిస్తుంది.

ఈ ప్రయత్నాలు వినియోగదారుల విశ్వాసాన్ని పెంచడంతో పాటు తయారీదారులు ఉత్పత్తిలో ఉత్తమ పద్ధతులు పాటించడం ద్వారా పరిశ్రమలో పూర్తిస్థాయి మెరుగుదల తీసుకువచ్చేందుకు దోహదపడతాయి. బీఐఎస్ ముద్ర అనేది నాణ్యతను సూచించేందుకు నమ్మకమైన కొలమానంగా ఉపయోగపడటంతో పాటు వినియోగదారులకు వారి ఎంపికలకు సంబంధించిన సమాచారాన్ని అందించేందుకు మరియు వంట పాత్రల్లో భద్రత మరియు శ్రేష్టతను పెంచుతుంది.

శభాష్.. ఎస్సై సంతోష్

-మానవత్వం చాటుకున్న శాంతి నగర్ ఎస్సై సంతోష్

మహబూబ్‌నగర్, జులై 6 :జోగుళాంబ గద్వాల జిల్లా శాంతి నగర్ మున్సిపాలిటీలోని మీసేవ సెంటర్ సమీపంలో ఆకలితో వృద్ధ మహిళ స్పృహ తప్పి పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించి, ఎస్ఐ సంతోష్ కు తెలిపారు. వెంటనే స్పందించిన సంతోష్ తమ సిబ్బందిని పంపి, స్థానిక వైద్యులతో ప్రథమ చికిత్స నిర్వహించి, ఆహారం అందించి కోలుకునేలా చేసి ఆమె వివరాలు సేకరించారు.

కలుకుంట్ల గ్రామానికి చెందిన మహిళగా గుర్తించి భర్త సవారిని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి ఆమెను బాగా చూసుకోవాలని సూచించారు. ఇలా వృద్ధ వయస్సులో ఇబ్బందులు కల్గించకూడదని, అమ్మ లేనిదే మనంలేమని, ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు.

రిమ్స్‌లో వైఎస్సార్సీపీ కార్యకర్తకు జగన్ పరామర్శ

కడప, జులై 6 : కడప జిల్లా పులివెందుల నియోజకవర్గం లోని వేంపల్లి లో టీడీపీ శ్రేణుల దాడిలో గాయపడి కడప రిమ్స్ లో చికిత్స పొందుతున్న వైఎస్సార్సీపీ కార్యకర్త అజయ్ ను వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పరామర్శించారు.

శనివారం జిల్లా పర్యటనకు వచ్చిన వైఎస్ జగన్.. కడప మధ్యాహ్నం కడప విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వైసీపీ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.

కాగా.. వేంపల్లెలో శుక్రవారం వైఎస్సార్సీపీ కార్యకర్త అజయ్ పై టీడీపీ నేతలు విచక్షణా రహితంగా దాడి చేశారు. ఈ దాడిలో అజయ్ తీవ్రంగా గాయపడ్డారు. దీంతో ఆయన్ను కడప రిమ్స్ కు తరలించి చికిత్స అందిస్తున్నారు. కార్యకర్త దాడి గురించి తెలుసుకున్న జగన్.. నేరుగా ఎయిర్ పోర్ట్ నుంచి రిమ్స్ కు చేరుకుని బాధితుడు అజయ్ ను కలిసి దాడి జరిగిన విధానం గురించి అడిగి తెలుసుకున్న ఆయన.. నేనున్నాను.. భయపడవద్దు ధైర్యంగా ఉండాలి.. అంటూ ధైర్యం చెప్పారు. పార్టీ తరఫున అవసరమైన సాయం చేస్తామని భరోసా ఇచ్చారు.

భలే జోకులేస్తున్నారు బొత్స గారు.. సెటైర్లు వేస్తూ రీట్వీట్ చేసిన మంత్రి అచ్చెన్నాయుడు

అమరావతి, జులై 6 :మాజీ మంత్రి , వైసీపీ నాయకుడు బొత్స సత్యనారాయణ ట్వీట్‌పై ఏపీ మంత్రి అచ్చెన్నాయుడు ఘాటుగా స్పందించారు. బొత్స వ్యాఖ్యలపై సెటైర్లు సంధించారు. భలే జోకులేస్తున్నారు బొత్స గారు..! పారదర్శకత గురించి మీరు.. జగన్ మాట్లాడితే నవ్వీపోతారు.. వద్దులెండి..? పారదర్శకతకు పాతరేసిందే మీరు.. మీ పార్టీ అని ఆరోపించారు.

ప్రెస్ మీట్లు కూడా లైవ్ కాకుండా ఎడిట్ చేసి ఇవ్వాలని ఆదేశించే నాయకత్వంలో మీరు పని చేస్తున్నారు. దయచేసి పారదర్శకత.. వాస్తవాలు వంటి పెద్ద పెద్ద పదాలు మీరు వాడొద్దు..ప్రజలకు అన్ని విషయాలు తెలుసు.. సమావేశ మయ్యాక.. అన్ని తెలుస్తాయని పేర్కొన్నారు.

మాజీ మంత్రి , వైసీపీ నాయకుడు బొత్స సత్యనారాయణ శనివారం ఆసక్తికర ట్వీట్ చేశారు. ఇద్దరు సీఎంల సమావేశాన్ని ప్రత్యక్షప్రసారం చేయాలని సూచిస్తూ.. పోస్టు చేశారు.

బడ్జెట్ సమావేశాలకు ముహూర్తం ఫిక్స్.. ఈ నెల 23న కేంద్ర బడ్జెట్

న్యూఢిల్లీ, జులై 6 :18వ లోక్‌సభ కొలువుదీరిన విషయం తెలిసిందే. జూన్ 24వ తేదీన 18వ లోక్‌సభ మొదటి సెషన్ ప్రారంభం కాగా.. జూన్ 26న ఓం బిర్లా వరుసగా రెండోసారి లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికయ్యారు. ఇక తొలి సమావేశాలు ముగియడంతో ఇప్పుడు కేంద్రం బడ్జెట్ సమావేశాలకు ముహూర్తం ఫిక్స్ చేసింది. ఈనెల 22వ తేదీ నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నట్లు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజుజు శనివారం ప్రకటించారు. ఆగస్టు 12 వరకూ ఈ సమావేశాలు జరగనున్నట్లు తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పూర్తి స్థాయి బడ్జెట్‌ను జులై 23న లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు.

ఇదిలా ఉండగా.. లోక్‌సభ ఎన్నికలకు ముందు ఈ ఏడాది ఫిబ్రవరిలో మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఎన్నికల అనంతరం పూర్తిస్థాయిలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నట్లు ప్రభుత్వం అప్పట్లో తెలిపింది. ఈ నేపథ్యంలోనే కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో 2024-25 సంవత్సరానికి సంబంధించి పూర్తి స్థాయి బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సభలో ప్రవేశ పెట్టనున్నారు.

ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్ సరికొత్త రికార్డ్ నెలకొల్పనున్నారు. వరుసగా రెండోసారి ఆర్థిక మంత్రిగా ఎన్నికైన ఆమె.. 2024-25 బడ్జెట్‌ను సమర్పించనున్నారు. అయితే, వరుసగా ఆరుసార్లు బడ్జెట్‌లను సమర్పించిన మాజీ ఆర్థిక మంత్రి మొరార్జీ దేశాయ్‌ని అధిగమించనున్నారు. మొరార్జీ దేశాయ్ వరుసగా ఆరుసార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈసారి కేంద్ర ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెడితే.. వరుసగా ఏడు కేంద్ర బడ్జెట్‌లను సమర్పించిన ఆర్థిక మంత్రిగా ఆమె సరికొత్త రికార్డ్ క్రియేట్ చేయనున్నారు.

కాగా, మోదీ తొలి విడుత మంత్రి వర్గంలో (2014) పరిశ్రమలు, వాణిజ్యశాఖ మంత్రిగా నిర్మలా సీతారామన్ బాధ్యతలు చేపట్టారు. 2017లో కీలకమైన రక్షణ శాఖ బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత 2019లో రెండోసారి ప్రధాని మోదీ ఎన్నికైన తర్వాత ఏర్పాటైన కేంద్ర మంత్రి వర్గంలోనూ చోటు దక్కించుకున్న నిర్మలా సీతారామన్‌కు అత్యంత కీలకమైన ఆర్థికశాఖను అప్పగించారు నరేంద్రమోదీ. నాటి నుంచి దేశీయ ఆర్థిక రంగంలో మలి విడుత ఆర్థిక సంస్కరణలను వరుగులెత్తించారు. కేంద్ర మంత్రివర్గంలో మూడోసారి వరుసగా చోటు దక్కించుకున్న ఏకైక మహిళా నాయకురాలిగా నిర్మలా సీతారామన్ రికార్డు నెలకొల్పారు.

కాశ్మీర్‌లో ఆర్మీ జవాన్ గుండెపోటుతో మృతి -భావపురిలో విషాదం

అమరావతి, జులై 6 : దేశ సరిహద్దులో అహర్నిశం పహారా కాస్తూ? త్వరలోనే ఉద్యోగ విరమణతో బాపట్లలో ఇల్లు కట్టుకుని హాయిగా తన జీవితాన్ని గడుపుతానని కుటుంబ సభ్యులు.. స్నేహితులతో చెప్పి వెళ్లిన ఆర్మీ జవాన్ షేక్ రజ్జు భాష అకస్మికంగా గుండెపోటుతో తిరిగిరాని లోకాలకు చేరుకోవటం భావపురి గొల్లుమంది. కన్నీరు మున్నీరైంది,. ఈ విషాద ఘటన వివరాలు ఇలా ఉన్నాయి, బాపట్ల పట్టణం బావ పూరి కాలనీకి చెందిన షేక్ రజ్జు బాషా (42) జమ్ము కాశ్మీర్లో ఇండియన్ ఆర్మీలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ బుధవారం రాత్రి 11 గంటల సమయంలో వాష్ రూమ్ కి వెళ్లి గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. తోటి స్నేహితులు గుర్తించి హాస్పటల్ కు తీసుకువెళ్లిన అప్పటికే మృతి చెందాడని డాక్టర్లు ధ్రువీకరించారు.

బాపట్ల పట్టణం బావ పూరి కాలనీకి చెందిన రాజ్జు భాషా తండ్రి ఖాజావలి హోటల్లో సర్వర్ గా పని చేస్తాడు . తల్లి దరియాభి ఇళ్ళవద్ద ఇడ్లీలు అమ్ముతూ జీవనం సాగిస్తారు. అతి నిరుపేద కుటుంబం నుండి వచ్చిన రాజ్జు భాష ఆర్మీలో ఉద్యోగం సంపాదించి కుటుంబానికి చేదోడుగా నిలిచాడు. గత 22 సంవత్సరాలుగా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు .

ఈ ఏడాది చివరినాటికి పదవీ విరమణ చేసి బాపట్ల లో గృహాన్ని నిర్మించుకొని జాలీగా గడుపుతానంటూ ఇటీవల సెలవు పై ఇంటికి వచ్చి వెళుతూ బంధువులతో స్నేహితులతో చెప్పాడు. సరదాగా ఉద్యోగ నిర్వహణకు వెళ్లిన రజ్జు భాష మృతి చెందాడని వార్తను ఈ ప్రాంత వాసులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు జీర్ణించుకోలేకపోతున్నారు.

జమ్మూ కాశ్మీర్లో జూనియర్ కలెక్షన్ ఆఫీసర్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న రాజ్జు భాషా మృతి సమాచారాన్ని ఆర్మీ అధికారులు గురువారం తెల్లవారుజామున కుటుంబ సభ్యులకు తెలియజేశారు. మృతదేహాన్ని శనివారం తెల్లవారుజామున ఆర్మీ అధికారులు ప్రత్యేక వాహనంలో బాపట్ల తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు .

రజ్జు భాష మృతదేహాన్ని చూసిన కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. బాపట్ల ఎమ్మెల్యే వేగేసిన నరేంద్ర వర్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు కుటుంబ సభ్యులకు అన్ని విధాల అండగా ఉంటామని తెలిపారు జరిగిన సంఘటనను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. ప్రభుత్వం నుండి కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలను అందిస్తామని అన్నారు.

ఈనెల 8వ తేదీ నుండి ఉచిత ఇసుక విధానం అమలు- కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు, జులై 6 : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో ఈనెల 8వ తేది నుండి ఉచిత ఇసుక విధానం అమలు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. శనివారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ తో కలిసి సంబంధిత అధికారులతో కలెక్టర్ జిల్లా స్థాయి ఇసుక కమిటీ (డీఎల్ఎస్సీ) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఉచిత ఇసుక విధానాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జులై 8వ తేది నుండి కౌతాళం మండలం గుడికంబాలి స్టాక్ పాయింట్ నుండి ప్రజల అవసరార్థం ఇసుక రవాణాను ప్రారంభించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

గుడికంబాలి స్టాక్ పాయింట్ లో ఇప్పటివరకు 29వేల 351 టన్నులు ఇసుక నిల్వ ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. గుడికంబాలి స్టాక్ పాయింట్ లో అందుబాటులో ఉన్న స్టాక్ ను వెంటనే కౌతాళం తహసీల్దార్ పంచనామా చేసుకొని హ్యాండ్ ఓవర్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డీడీ మైన్స్, కౌతాళం తహసీల్దార్ ను కలెక్టర్ ఆదేశించారు.. అలాగే ఇసుక డిపో వద్ద వీఆర్ఏ, వీఆర్ఓ లను ఇన్చార్జి లుగా నియమించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇసుక రవాణా వివరాలను తనకు ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు..

అలాగే సి.బెళగల్ మండలంలో 5 డీసిల్టినీగ్ పాయింట్లు.. కొత్తకోట, కె.సింగవరం, ఈర్లదిన్నె, గుడుమాల, పల్లెదొడ్డి ఉన్నాయని, వీటికి పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ నుండి క్లియరెన్స్ ఇచ్చిన వెంటనే వీటిని కూడా ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటామని, ఆ మేరకు క్లియరెన్స్ వచ్చే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మైన్స్ శాఖ అధికారులను ఆదేశించారు.. ప్రతి డీసిల్టినీగ్ పాయింట్ వద్ద ఒక ఇన్చార్జిని నియమించాలని కలెక్టర్ కర్నూలు ఆర్డీవో ను ఆదేశించారు.. జిల్లా స్థాయి ఇసుక కమిటీ (డిఎల్ఎస్సీ)చే ఇసుక టన్నుకు 335 రూపాయలు నిర్ణయించడం జరిగిందన్నారు.. రేవుల్లో ఇసుక తవ్వకం, లోడింగ్, ట్రాన్స్పోర్టేషన్, సీనరేజ్, డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్, జీఎస్టీల కోసం మాత్రమే ఈ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందన్నారు..

జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ మాట్లాడుతూ.. మన జిల్లా ఇసుక ఇతర రాష్ట్రాలకు రవాణా జరగకుండా తగిన భద్రతా చర్యలు చేపడుతున్నామని తెలిపారు..గనుల శాఖ డీడీ రాజశేఖర్ మాట్లాడుతూ.. ఇసుక కోసం వచ్చే ప్రజలు ఇసుక ఆధార్ కార్డు జిరాక్స్ ఖచ్చితంగా తీసుకొని రావాలని సూచించారు. ఈ సమావేశంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ముని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

9న బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణం.. ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే తలసాని

హైదరాబాద్, జులై 6 :బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణానికి వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 9 వ తేదీన బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణం జరగనున్న నేపథ్యంలో వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన ఆలయ పరిసరాలలో పర్యటించారు.

ఈ సందర్భంగా తలసాని శరీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రతి ఏటా నిర్వహించే అమ్మవారి కళ్యాణాన్ని వీక్షించేందుకు లక్షలాదిమంది భక్తులు వస్తుంటారని, వారు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. 2014కు ముందు అమ్మవారి కళ్యాణాన్ని ఆలయం లోపల నిర్వాహించేవారని గుర్తు చేశారు. కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆలయం ముందు, పక్కన రెండు భారీ రేకుల షెడ్డులను నిర్మించి ఆ షెడ్డు కింద అత్యంత ఘనంగా వేలాదిమంది భక్తుల సమక్షంలో అమ్మవారి కళ్యాణం ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నామని తెలిపారు. వివిధ ప్రాంతాలలో ఉన్న వారు కూడా అమ్మవారి కళ్యాణాన్ని వీక్షించే విధంగా ప్రసార మాధ్యమాల ద్వారా ప్రత్యక్ష ప్రసారం (లైవ్ టెలికాస్ట్) చేయడం జరిగిందని తెలిపారు.

అమ్మవారి కళ్యాణానికి ఇంకా రెండు రోజులు మాత్రమే గడువు ఉన్నందున పనులను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆలయ పరిసరాలలో ఎలాంటి సీవరేజ్ లీకేజీలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వాటర్ వర్క్స్ అధికారులను ఆదేశించారు. కళ్యాణానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు ఆలయ పరిసరాలలో పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారని, వారి అవసరాలకు సరిపడా నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. అదేవిధంగా అమ్మవారి దర్శనం సందర్భంగా భక్తులు తోపులాటకు గురికాకుండా పటిష్టమైన భారికేడ్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.శాంతి భద్రతల పర్యవేక్షణలో భాగంగా అవసరమైన ప్రాంతాలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఆలయ పరిసరాలలోని ప్రజలు కూడా అధికారులకు అన్ని విధాలుగా సహకరించాలని కోరారు. అమ్మవారి కళ్యాణం, రథోత్సవం జరిగే రెండు రోజులపాటు భక్తులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ట్రాఫిక్ డైవర్షన్ చేపట్టాలని ట్రాఫిక్ పోలీసులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో లా అండ్ ఆర్డర్ ఏసీపీ వెంకటరమణ, ఆర్ అండ్ బీ ఈఈ రవీంద్ర మోహన్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకట్, జీహెచ్ఎంసీ డీసీ జగన్, ఈఈ ఇందిర, వాటర్ వర్క్స్ జీఎం హరి శంకర్, ఈవో అంజన కుమారి, ఆలయ చైర్మన్ సాయిబాబా, మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు హన్మంతరావు, ఆలయ కమిటీ సభ్యులు అశోక్ యాదవ్, కూతురు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి పోచంపల్లి వస్త్రాలు

ఈ నెల 9 వ తేదీన జరగనున్న శ్రీ బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణం సందర్భంగా అమ్మవారికి పోచంపల్లి చేనేత పట్టువస్త్రాలను సమర్పించారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో మగ్గంపై నేసిన వస్త్రాలను శనివారం పద్మశాలి సంఘం సభ్యులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సమక్షంలో ఆలయ ఈవో, చైర్మన్‌లకు అందజేశారు.

తిరుమలను దర్శించుకున్న హంపీ మఠం పీఠాధిపతి

తిరుపతి, జులై 6 :శ్రీ విరూపాక్ష విద్యారణ్య మహాసంస్థానం, హంపీ మఠం పీఠాధిపతి జగద్గురు విద్యారణ్య భారతి స్వామిజీ శనివారం తన శిష్యులతో కలిసి తిరుమల వేంకటేశ్వర స్వామి ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆయన రాక సందర్భంగా ఆలయ ప్రధాన ద్వారం వద్ద టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, వేదపండితులు ఆలయ మర్యాదతోస్వాగతం పలికారు.తెలంగాణ ఎంపీ రఘునందన్‌రావు స్వామివారిని దర్శించుకున్నారు . ఈ సందర్భంగా ఆలయం బయట ఆయన మీడియాతో మాట్లాడారు. ఇద్దరు సీఎంల మధ్య సన్నిహిత సబంధాలు ఉన్నందున ఉభయ రాష్ట్రాల ప్రజలకు ఆనందాన్నిచ్చేలా సీఎంల భేటీ ఉండాలని ఆకాంక్షించారు. అన్ని సమస్యలకు పరిష్కారం దిశగా సమావేశం జరపాలని తెలిపారు.తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. నిన్న స్వామివారిని 65,775 మంది భక్తులు దర్శించుకోగా 25,126 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 3.41 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు.

సింగపూర్ బీచ్‌లో తెలంగాణ యువకుడు అనుమానాస్పద మృతి

న్యూఢిల్లీ, జులై 6 : సింగపూర్‌లో తెలంగాణ యువకుడు అనుమానాస్పద స్థితిలో మరణించాడు. సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణానికి చెందిన చౌడవరపు పవన్ మృతదేహం సింగపూర్ బీచ్‌లో శుక్రవారం రాత్రి కనిపించింది. పాస్‌పోర్టు ఆధారంగా మృతుడిని గుర్తించిన సింగపూర్ పోలీసులు.. అతని స్నేహితులను విచారిస్తున్నారు. ఒక్కడే వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడా? ఎవరైనా చంపేశారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కోదాడ పట్టణానికి చెందిన పవన్ ఏడాదిన్నర క్రితం సింగపూర్ వెళ్లాడు. అక్కడ ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో తాత్కలిక ప్రాతిపదికన ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో జూలై 5వ తేదీన సరదాగా గడిపేందుకు బీచ్‌కు వెళ్లాడని.. అక్కడే అలల ఉధృతికి నీటిలో కొట్టుకుపోయి మరణించాడని పవన్ స్నేహితులు చెబుతున్నారు. ఇదే విషయాన్ని కోదాడలోని పవన్ తల్లిదండ్రులకు తెలియజేశారు.

మృతుడు పవన్ తండ్రి శ్రీనివాసరావు కోదాడలో పల్లి నూనె వ్యాపారం చేస్తున్నాడు. సోదరుడు లండన్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. పవన్ కూడా రెండు నెలల్లో ఉద్యోగం కోసం అమెరికా వెళ్లాల్సి ఉంది. కానీ ఇంతలోనే ఇలా జరగడంతో పవన్ తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. పవన్ మృతదేహాన్ని తొందరగా ఇంటికి తీసుకురావాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు.

అభివృద్ధి పనులకు సహకరించండి - మంత్రి శ్రీధర బాబుకి బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు వినతి

హైదరాబాద్, జులై 6 : తమ తమ నియోజకవర్గాలలో అభివృద్ధి పనులకు సహకరించాలని బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు మంత్రి దుద్దిళ్ల శ్రీధర బాబుని కోరారు. ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి, వివేకానంద గౌడ్, అరికెపూడి గాంధీ, మాధవరం కృష్ణారావు, లక్ష్మారెడ్డి, రాజశేఖర్ రెడ్డిలు నేడు మంత్రి కార్యాలయంలో కలిశారు.. అభివృద్ధి పనుల ప్రతిపాదనలను మంత్రికి అందించారు. అలాగే, జీహెచ్ఎంసీకి నిధులు విడుదల చేయాలని వారు శ్రీధర్ బాబును కోరారు. కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి జీహెచ్ఎంసీకి నిధులు విడుదల చేయలేదని వారు మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు..

అందరూ ఆహ్వానితులే
అఖిల భారతీయ కుమ్మర శాలివాహన ప్రజాపతి కుంభకార్ మహాసంఘ్
తెలంగాణ రాష్ట్రం(రి. నెం. 1109/2023) మరియు
తెలుగు భాషా చైతన్య సమితి సంయుక్త ఆధ్వర్యంలో
శ్రీ శ్రీ శ్రీ సిద్దప్ప వరకవి రాజయోగి జయంత్యుత్సవం
ముఖ్యఅతిథి:
శ్రీ డాక్టర్ ఎన్. బాలా చారి తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి
విశిష్ట అతిథులు:
శ్రీ బైస దేవదాసు సంపాదకులు, నేటి నిజం పత్రిక
శ్రీ బడేసాబ్ వ్యవస్థాపకులు, తెలుగు భాషా చైతన్య సమితి
శ్రీ రామకృష్ణ చంద్రమౌళి ప్రముఖ కవి & విమర్శకులు
శ్రీమతి డా. రాధా కుసుమ చైర్పర్సన్, కుసుమ ధర్మన్న కళాపీఠం
శ్రీ కటకం నర్సింగ్ రావు వ్యవస్థాపకులు, అవేర్ ఫౌండేషన్
శ్రీ రాజగోపాల్ నాయుడు గౌరవ అధ్యక్షులు, తెలుగు భాషా చైతన్య సమితి
శ్రీ మంగళంపల్లి శ్రీహరి విభాగ్ ప్రముఖ్, సామాజిక సమరసత
కార్యక్రమం
జయంతి ఉత్సవం మరియు కవి సమ్మేళనం
తేది: 09-07-2024 (మంగళవారం)
వేదిక: సుందరయ్య విజ్ఞాన కేంద్రం (ఐలమ్మ ఆర్ట్ గ్యాలరీ) బాగ్ లింగంపల్లి, హైదరాబాద్
సమయం: సా.గం.6:00 ల నుండి రా.గం.8:30 ని.ల వరకు
ఆహ్వానించువారు:
శ్రీ చిట్టిమల్ల అశోక్ కుమార్ ప్రజాపతి, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు
శ్రీ ఎలిశాల కృష్ణ ప్రజాపతి, రాష్ట్ర ముఖ్య ప్రధాన కార్యదర్శి
శ్రీ కొర్లపల్లి స్వామి ప్రజాపతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
శ్రీ దొమ్మాటి నాధం ప్రజాపతి, రాష్ట్ర కోశాధికారి
మరియు సంఘం కార్యవర్గం
శ్రీ సిలివేరు శంకర్ ప్రజాపతి రాష్ట్ర యువజన అధ్యక్షులు & జయంతి కన్వీనర్
శ్రీ మిరుదొడ్డి శివానంద్ ప్రజాపతి రాష్ట్ర అధ్యక్షులు

ఆంధ్రాలో పెళ్లి కొడుకు అయితే.. తెలంగాణలో ఎందుకు పందిరి వేస్తున్నారు..? రేవంత్, చంద్రబాబు భేటీపై నిరంజన్ రెడ్డి సెటైర్లు

హైదరాబాద్, జులై 6 : ఆంధ్రాలో పెళ్లి కొడుకు అయితే.. తెలంగాణలో ఎందుకు పందిరి వేస్తున్నారో అర్థం కావడం లేదని రేవంత్, చంద్రబాబు భేటీపై మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తెలంగాణ భవన్‌లో నిరంజన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.

గత పదేండ్ల నుంచి ఎవరి మానాన వారు బతుకుతున్నారు. కానీ మానిన గాయాలను మళ్లీ రగిల్చేందుకు చంద్రబాబు, రేవంత్ కలిసి కుట్రలు చేస్తున్నారు. ఇరు రాష్ట్రాల సమస్యల పరిష్కారానికి వేదికగా ఉండడం అభ్యంతరం లేదు. కానీ ఇక్కడ మేం మళ్లీ మా పాత్ర పోషిస్తామని రాజకీయ ఆర్భాటాలు ఎందుకు చేస్తున్నారో అర్థం కావడం లేదు. చంద్రబాబు ఆంధ్రాలో సీఎం అయ్యారు. తెలంగాణ రాజధానిలో ఎందుకు పందిరి వేస్తున్నారో అర్థం కావడం లేదు. పెళ్లికొడుకు ఒకచోట.. పెళ్లి ఒకచోట.. పందిరి మాత్రం తెలంగాణలో వేస్తున్నరు. ఆర్భాటం హైదరాబాద్‌లో చేస్తున్నరు. హైదరాబాద్‌లో ఆర్భాటం ఎందుకు.. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. అపరిష్కృత అంశాల మీద చర్చ అనుకుంటే ఆ అడుగులు వేరేలా ఉండేవి. కానీ అలా లేవు. పరోక్షంగా తెలంగాణను పరిపాలించేటటువంటి కుట్ర ప్రారంభమైంది. తెలంగాణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నాను అని నిరంజన్ రెడ్డి తెలిపారు.

తెలంగాణలో కాంగ్రెస్ పాలన సవ్యంగా లేదు. ప్రజలు రోడ్ల మీదకు వచ్చే పరిస్థితి ఉంది. నిరుద్యోగులను, యువతను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చారు. కానీ ఇవాళ నిరుద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం వినడం లేదు. టీఎస్‌పీఎస్సీ వద్ద కంచెలు వేయించి అమానుషంగా నిరుద్యోగులను అరెస్టు చేశారు. చివరకు రహదారిపై వెళ్తున్న దంపతులను, రైతులను కూడా అరెస్టు చేశారు. మొన్నటి ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలైంది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో అమలుకు కట్టుబడి ఉందా.. మేనిఫెస్టోలో పేర్కొన్న గ్యారెంటీలు ఏమయ్యాయి.. అని నిరంజన్ రెడ్డి నిలదీశారు.

బాబూ జగ్జీవన్ రాం జీవితం స్ఫూర్తిదాయకం

– ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్



రాజన్న సిరిసిల్ల, జులై 6 :(నేటినిజం ప్రతినిధి): దేశ స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త, భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తిదాయకం అని ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లి గ్రామంలో బాబూ జగ్జీవన్ రాం వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు.. ఈ సందర్భంగా వారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు..వారు మాట్లాడుతూ వారు చేసిన సేవలు ఈ తరానికి ఒక స్ఫూర్తిగా నిలిచేల కృషి చేయాలన్నారు.నేటి యువత వారిని ఆదర్శంగా తీసుకొని ముందుకు పోవాలన్నారు..జగ్జీవన్ రామ్ ఒక గొప్ప సంఘసంస్కర్త రాజకీయవేత్త సమాజంలో అణగారిన ప్రజల సమాన హక్కుల కోసం కులరహిత సమాజం కోసం పోరాడిన ఒక గొప్ప పోరాట యోధుడు అని అన్నారు.. వారు ఎంపీగా కేంద్ర మంత్రిగా దేశ ఉప ప్రధానిగా దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు..జగ్జీవన్ రామ్ కూతురు మీరా కుమారి కూడా వారి అడుగు జాడల్లో నడుస్తూ దేశానికి సేవలు అందించారని,తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమయంలో వారు స్పీకర్ గా ఉండి తెలంగాణ బిల్లు పాసయ్యే సమయంలో వారు ఉన్నారని గుర్తు చేశారు..ప్రజలను చైతన్యవంతం చేయడంలో వారు ఎప్పుడు ముందు ఉండేవారన్నారు..రాష్ట్ర ప్రభుత్వం నిస్సహాయకులకు సహాయం చేయడానికి అరుగ్యారెంటీలని అమలు చేస్తోదన్నారు.ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండి రైతు రుణమాఫీ చేసేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందని. అది కూడా ఏకకాలంలో రుణమాఫీ చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు.2008 లో మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఉన్నపుడు ఉమ్మడి రాష్ట్రంలో ఏకకాలంలో రైతులకు 68 వేల కోట్లు రుణమాఫీ చేశామని మళ్ళీ ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఏకకాలంలో 2 లక్షల రుణమాఫీతో రాష్ట్రంలో 31 వేల కోట్లు చేయడం జరుగుతుందని అన్నారు..రైతు బంధును రైతు భరోసాగా పేరు మార్చామని గతంలో గుట్టలకు రియల్ ఎస్టేట్ వెంచర్లకు రైతు బంధు ఇచ్చారని కానీ ఇప్పుడు నిజమైన రైతులలకు ఇస్తామని, దానికోసం రాష్ట్రప్రభుత్వం కమిటీ వేసిందన్నారు..రానున్న రోజుల్లో వారి ఆలోచన పూర్తిగా తీసుకొని పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి తోడ్పడుతానని అన్నారు..

దుస్థితిలో గద్వాల వయా మల్దకల్ ఐజ రోడ్డు

-నడి బొడ్డున ఉన్న రోడ్డుని పట్టించుకునే నాధుడే లేడు...

-జోగులాంబ గద్వాల జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు తట్టె మహేష్

గద్వాల జూలై 6 (ఎక్స్ ప్రెస్ న్యూస);గద్వాల వయా మల్దకల్ ఐజ రోడ్డు దుస్థితి నడి బొడ్డున ఉన్న రోడ్డుని పట్టించుకునే నాధుడే లేడు అని జోగులాంబ గద్వాల జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు తట్టె మహేష్ అన్నారు...ఈరోజు ఈ రోడ్డు మార్గాన మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా తట్టె మహేష్ మాట్లాడుతూ.... గద్వాల్ ఐజ రోడ్డుమీద ప్రయాణికులు ఎంతమంది చనిపోయినారో ఇది అందరికీ తెలుసు మరణాలు పెరుగుతున్నాయి కానీ మరమ్మత్తులు జరగడం లేదుఅని అన్నారు...దీనికి ఎవరు బాధ్యులు ఆర్ అండ్ బి శాఖ నా కలెక్టర్ గారా ప్రజలతో ఎన్నుకోబడిన ప్రజా పాలకుల స్వచ్ఛందంగా లారీ అసోసియేషన్ వాళ్లు రోడ్డు మరమ్మతులు చేయించుకుంటున్న దుస్థితి గద్వాలలో నడుస్తుంది ఇది ఎంతవరకు సబజం ఈ రోడ్డుమీద ఆర్ అండ్ బి శాఖ మరియు కలెక్టర్ గారు గమనించినారో లేదో తెలియదు కానీ ఆర్ అండ్ బి శాఖ కలెక్టర్ గారు కూడా ఈ రోడ్డు మీద రాకుండా పోవచ్చు లేకుంటే ఈ రోడ్డు ఈ పరిస్థితి ఉండేది కాదు అని వారు అన్నారు.ఈ రోడ్డు మార్గాన మరమ్మతులు చేయించిన వారు ఆర్ఎంపి మోయిన్ భాష వి డబ్లు సి రవి,లారీ అసోసియేషన్ మెంబర్ మసుద్ మరియు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తో బొజ్జా భేటి..

అమరావతి, జులై 6 :రాయలసీమ అభివృద్ధికి సంబంధించిన విషయాలపై చర్చించి, వాటిని ప్రభుత్వం ముందుంచి పరిష్కార దిశగా అడుగులు వేసే దిశలో భాగంగా న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తమ గృహానికి విచ్చేసినందుకు రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథ రామిరెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. నిరంతరం రాయలసీమ అంశాలపై పోరాడుతున్న బొజ్జా దశరథ రామిరెడ్డిపై గౌరవంతో, వారి కుటుంబంపై ఉన్న గౌరవంతో బొజ్జా ఇంటికి తాను స్వయంగా వచ్చానని ప్రకటించడం వారి సంస్కారాన్ని ప్రతిబింబిస్తుందని సమితి సభ్యులు కొనియాడారు.

రాయలసీమ సాగునీటి రంగానికి సంబంధించిన అనేక అంశాలను, నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పరిరక్షణకు సంబంధించిన అంశాన్ని, కర్నూలు జిల్లాను సీడ్ హబ్ గా మార్చే విషయాన్ని గౌరవం మంత్రి దృష్టికి బొజ్జా తీసుకొనివచ్చారు. ఈ అంశాలపై స్పందిస్తూ? నంద్యాల పరిశోధన స్థానం నుండి తాత్కాలిక కలెక్టరేట్ ను తరలించి, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంను పరిరక్షిస్తామని హామీ ఇచ్చారు. జిల్లా మంత్రులు, శాసనసభ్యులు, అధికారులు, రైతు ప్రతినిధులతో చర్చించి రాయలసీమ అభివృద్ధికి సంబంధించిన అంశాలను ప్రభుత్వం ముందుంచుతానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి తో రాయలసీమ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై రైతు ప్రతినిధుల సమావేశం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.

తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీపడితే ఊరుకోం

– ఎమ్మెల్యే దానం నాగేందర్ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

–రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో వైఫల్యం చెంది అవినీతిలో కూరుకుపోయింది

– ఓటమి భయంతోనే..కాంగ్రెస్ సర్కార్ పంచాయతీ ఎన్నికలకు వెళ్లడం లేదు

–గ్రామ పంచాయతి సిబ్బందికి అవుట్ సోర్సింగ్, గ్రామ కార్యదర్శులకు ఆరు నెలల నుంచి వేతనాలు లేవు

–బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

హైదరాబాద్ జూలై 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్);విభజన సమస్యల పరిష్కారం కోసం రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీని స్వాగతిస్తున్నామని, అయితే తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీపడితే మాత్రం ఊరుకునేది లేదని బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం అసంబ్లి మీడియా హాల్ లో మీడియాతో మాట్లాడుతూ విభజన సమస్యల పరిష్కారంకు కేంద్రం సానుకూలంగా ఉందని తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెడితే చూస్తూ ఊరుకోని తెలిపారు.

తెలంగాణ స్పీకర్ కనబడటం లేదు.: ఏలేటి

ఎమ్మెల్యే దానం నాగేందర్ సభ్యత్వాన్ని రద్దు చేయకపోతే ప్రజాస్వామ్యం పై ప్రజలకు నమ్మకం పోతుందని మహేశ్వర్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ విషయం లో పిటిషన్ తీసుకోకుండా స్పీకర్ వ్యవహరిస్తున్నారని తెలిపారు. అసెంబ్లీ కార్యాలయానికి ఎన్నిసార్లు వెళ్లినా కనపించడం లేదన్నారు. స్పీకర్ గారికి రిజిస్టర్ పోస్టులో పంపిస్తే , లెటర్స్ ను మళ్ళీ తిరిగి పంపిస్తున్నారని చెప్పారు. ఈ విషయంలో ఇప్పటికే హై కోర్టులో కేసు ఉందని, అవసరమైతే సుప్రీంకోర్టును కూడా ఆశ్రయిస్తామని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో వైఫల్యం చెంది అవినీతిలో కూరుకుపోయింది

రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో వైఫల్యం చెంది అవినీతిలో కూరుకుపోయిందని బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. సర్కార్ పెద్దలు, వివిధ ట్యాక్సుల పేరుతో అవినీతికి పాల్పడితే వాస్తవాలతో సహా బయటపెట్టామని తెలిపారు. ముఖ్యంగా సివిల్ సప్లయ్ శాఖలో జరిగిన అవినీతి అక్రమాలపై కేంద్రానికి నివేదిక ఇచ్చామని, త్వరలోనే విచారణ జరుగుతుందని తెలిపారు.

ఓటమి భయంతోనే ... కాంగ్రెస్ సర్కార్ పంచాయతీ ఎన్నికలకు వెళ్లడం లేదు

ఓటమి భయంతోనే కాంగ్రెస్ సర్కార్... పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు వెనకాడుతోందని బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. ఇన్ని రోజులు పంచాయతీల్లో స్పెషలాఫీసర్ల పాలన ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని తెలిపారు. పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించకుండా తాత్సారం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి తమది ప్రజాపాలన అని చెప్పుకోవడానికి సిగ్గుండాలని ఎద్దేవా చేశారు. ప్రత్యక్ష ప్రజాస్వామ్యానికి ప్రతీకలైన పంచాయతీలకు తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీలకు ఏడాదిన్నర కాలంగా రాష్ట్ర ఆర్థిక సంఘం రాఈఅ – రాబిజీబిఏ ఈతినిజీనిఇవ అనీఎఏతిబబతినీని నిధులు దాదాపు రూ. 2 వేల కోట్ల విడుదల కావడంలేదన్నారు. పంచాయతీ వ్యవస్థలో ఎన్నికైన స్థానిక ప్రజా ప్రతినిధులు ఉంటేనే కేంద్రం నుంచి నిధులు వస్తాయని గుర్తు చేశారు. పాలవర్గాలు లేకపోవడంతో గ్రామపంచాయతీల్లో నిధులు లేక పల్లెలు కూనరిల్లుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు సర్పంచులు అప్పులు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు కొనసాగిస్తే...ఆరు నెలల నుంచి ప్రత్యేక అధికారులు అప్పులు చేసి పల్లెల్లో అభివృద్ధి పనులు చేస్తున్నారని తెలిపారు.

గ్రామ పంచాయతీకి నిధులు లేవు..ఏడు నెలల నుంచి పంచాయతీ సిబ్బందికి వేతనాలు లేవు,

ప్రజా పాలన అని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ పాలనలోనే ఏడు నెలలుగా పంచాయతీలకు నిధుల్లేవు. పంచాయతీ సిబ్బందికి వేతనాలు లేవని మహేశ్వర్ రెడ్డి తెలిపారు. గత్యంతరం లేక వారు కుటుంబ జీవనం కోసం కూలీ పనులకు వెళ్తున్నారని చెప్పారు.దీంతో గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందన్నారు. కనీసం చెత్తను ఎత్తేసేందుకు దిక్కులేదని తెలిపారు. కాని కాంగ్రెస్ నేతలు మాత్రం మీడియాలో ప్రజా పాలన అంటూ గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు.

చంద్రబాబు, తదితరుల కేసులు సిబిఐకి అప్పగించాలని పిల్

– పిల్ దాఖలు చేసిన స్వర్ణాంధ్ర పత్రిక ఎడిటర్ కొట్టి బాలగంగాధర్ తిలక్

–నిష్పాక్షిక, పారదర్శకమైన దర్యాప్తు కోసం కేసులను కేంద్ర దర్యాప్తు సంస్థకు అప్పగించాలంటూ పిటిషన్

అమరావతి జులై 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్); ముఖ్యమంత్రి చంద్రబాబు సహా పలువురు తెలుగు దేశం పార్టీ నేతలు, వ్యాపారవేత్తలపై ఉన్న కేసులన్నీ సిబిఐ, ఈడిలకు అప్పగించేలా ఆదేశాలు జారీ చేయాలంటూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. స్వర్ణాంధ్ర పత్రిక ఎడిటర్ కొట్టి బాలగంగాధర్ తిలక్ ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. చంద్రబాబుతో పాటు మంత్రులు నారా లోకేశ్, పొంగూరు నారాయణ, కింజరాపు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు, వ్యాపారవేత్తలు లింగమనేని రమేశ్, వేమూరు హరికృష్ణ సహా మొత్తం 114 మందిని ప్రతివాదులుగా పేర్కొన్నారు. హోం శాఖ ముఖ్య కార్యదర్శి హరీశ్ కుమార్ గుప్తాను వ్యక్తిగత హోదాలో ప్రతివాదిగా పేర్కొన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం, మద్యం కుంభకోణం, ఏపి ఫైబర్ నెట్ కుంభకోణం, అసైన్డ్ భూముల కుంభకోణం, ఇసుక కుంభకోణం, ఇన్నర్ రింగు రోడ్ అలైన్‌మెంట్‌లో అక్రమాలు తదితర స్కామ్‌లకు సంబంధించి దర్యాప్తు బాధ్యతలను సిబిఐ, ఈడిలకు అప్పగించాల్సిన అవసరం ఉందన్నారు. నిష్పాక్షిక, పారదర్శక, వేగవంతమైన దర్యాప్తు కోసం కేసులను సిబిఐ, ఈడికి అప్పగించాలని అభిప్రాయపడ్డారు.ఎన్నికల ఫలితాలు వచ్చిన రోజు నుంచీ డిజిపి, సిఐడి అదనపు డిజి తదితరులందరూ కూడా ఈ కేసుల విషయంలో ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని తిలక్ వివరించారు. ఈ కేసుల్లో సిఐడి, ఈడి ఇప్పటివరకూ చేసిన దర్యాప్తును చంద్రబాబు, ఇతర నేతలకు అనుకూలంగా నీరు గార్చేలా వ్యవహరిస్తున్నారని, ఈ పరిస్థితుల్లో హైకోర్టు ఈ కేసుల దర్యాప్తును సిబిఐ, ఈడికి అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని ఆయన కోరారు.

పోలీసు క్రీడాకారిణిని అభినందించిన ఎస్పీ కృష్ణకాంత్

కర్నూల్ , జులై 6 : జాతీయ పోలీసు జూడో క్లస్టర్ ఆటల పోటీల్లో 2 కాంస్యం పథకాలు సాధించిన కర్నూలు ఆర్మడు రిజర్వుడు ఆర్ ఎస్సై పి.కల్పనను శనివారం జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ అభినందించారు.

2024 జూన్ 24 నుండి జూన్ 30వరకు అస్సాం రాష్ట్రం ? గౌహతిలో అస్సాం పోలీసుల ఆధ్వర్యంలో జరిగిన 9వ జాతీయ పోలీసు జూడో క్లస్టర్ ఆటల పోటీల్లో ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ తరుపున కర్నూలు జిల్లా పోలీసు శాఖ నుండి ఆర్ ఎస్సై పి.కల్పన తైక్వాండోలో ఒక కాంస్యం, సిలాట్ పోటీల్లో ఒక కాంస్యం, మొత్తం 2 కాంస్య (ఃఖీూఔజిఇ) పతకాలు సాధించారు. భవిష్యత్తులో మరిన్ని పథకాలు సాధించాలని, జిల్లా పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ లు నారాయణ, జావేద్, ఆర్ ఎస్సైలు పావని, రవిశంకర్, రామస్వామి ఉన్నారు.

ఎంపి రఘురాంరెడ్డిని ఘనంగా సన్మానించిన కాంగ్రెస్ నేత

– బమ్మిడి శ్రీనివాస్ యాదవ్



ఖమ్మం, జులై 6 :(నేటినిజం ప్రతినిధి): ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి ప్రమాణ స్వీకారం తర్వాత తొలిసారిగా ఖమ్మం వచ్చిన సందర్భంగా ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం, సంజీవరెడ్డి భవన్ లో కాంగ్రెస్ పార్టీ ఓబిసి జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీనివాస్ యాదవ్ వారిని మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ జిల్లా అధ్యక్షులు పువాళ్ళ దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీలు బాలసాని లక్ష్మీనారాయణ, పోట్ల నాగేశ్వరరావు, కాంగ్రెస్ ముఖ్య నాయకులు కొత్త సీతారాములు, బాణాల లక్ష్మణ్, కమతం రామకృష్ణ, పల్లెబోయిన చంద్రం, మలీదు వెంకటేశ్వరరావు, సైదులు, గంజి సూర్యనారాయణ, నరేంద్ర, మహిళా జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, ప్రతిభా రెడ్డి, ప్రశాంతి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పుట్బాల్ టోర్నమెంట్‌కు ఎంపికైన అల్ఫోర్స్ విద్యార్థులు

కరీంనగర్, జులై 6 : (నేటినిజం ప్రతినిధి) స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్కు చెందినటువంటి విద్యార్థులు రాష్ట్ర స్థాయి పుట్బాల్ చాంపియన్షిప్ పోటీలకు ఎంపికైన సందర్భంగా ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక అభినందన సభ నిర్వహించారు ఈ సభకు ముఖ్య అతిధిగా అల్ఫోర్స్ సంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి హాజరై మాట్లాడారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థులు పుట్బాల్ పట్ల ఆసక్తి ప్రదర్శిస్తున్నారని తెలుపుతూ మరియు వివిధ పోటీలలో పాల్గొనేందుకు ప్రోత్సాహం చూపుతున్నారని చెప్పారు. ప్రాథమికంగా పాఠశాల స్థాయిలో పరిశీలన చేసి వివిధ పోటీలకు ఎంపిక చేస్తున్నామని చెప్పారు. అదేవిధంగా విద్యార్థులకు పోటీలలో పాల్గొనేందుకు నాణ్యతమైన శిక్షణతో పాటు వనరులను కల్పిస్తున్నామని చెప్పారు.ఈనెల 5న జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేట్ పాఠశాలలో జిల్లా ఫుట్బాల్ అసోసియేషన్నిర్వహించినటువంటి జిల్లా స్థాయి పోటీలలో పాఠశాలకు చెందినటువంటి బి.సహస్ర రెడ్డి, 9వ తరగతి మరియు డి. సుస్మితా రెడ్డి, 6వ తరగతి అత్యుత్తమ ప్రదర్శనతో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికవడమే కాకుండా ఈ నెల 12, 13 మరియు 14వ తేదీన మహబూబ్నగర్ నిర్వహింపబడే రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించడం చాలా గొప్ప విషయమని చెప్పారు. అర్హత సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తు విజేతలకు పుష్పగుచ్ఛాలను అందజేసి రాష్ట్ర స్థాయిలోను విశేషంగా రాణించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవ్వాలని అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించిన లక్ష్మీదేవిపల్లి పోలీసులు

భద్రాద్రికొత్తగూడెం, జూలై 6 (నేటినిజం ప్రతినిధి) :జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు శనివారం కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్ ఆధ్వర్యంలో లక్ష్మీదేవిపల్లి పోలీసులు, స్పెషల్ పార్టీ సిబ్బంది మండలంలోని గుత్తికొయ గ్రామమైన గంద్రభందం, బాసగుంపు గ్రామాలలో కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రామ్ ను నిర్వహించడం జరిగింది. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. గ్రామంలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు వస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని డిఎస్పీ గ్రామస్తులకు సూచించారు. దోమల బారిన పడకుండా ఇండ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. డెంగ్యూ, మలేరియా లాంటి విష జ్వరాల ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని గ్రామస్తులకు సూచించడం జరిగిందన్నారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే పోలీసు వారికి సమాచారం అందజేసి సహాయం తీసుకోవాలని సూచించారు. అనంతరం అక్కడ సమావేశంలో పాల్గొన్న ప్రతి కుటుంబానికి రెయిన్ కోట్లు, దుప్పట్లు, దోమతెరలను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్, చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, లక్ష్మీదేవిపల్లి ఎస్ఐ రమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

చిదంబరం వ్యాఖ్యలపై విరుచుకుపడ్డ ఉపరాష్ట్రపతి జగ్దీప్ ధన్ఖర్

న్యూఢిల్లీ జూలై 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఉపరాష్ట్రపతి జగ్దీప్ ధన్ఖర్, పి. చిదంబరం పేరెత్తకుండానే ఓ కాంగ్రెస్ నాయకుడు మూడు కొత్త క్రిమినల్ చట్టాలపై చేసిన వ్యాఖ్యలు తనను గ్ర్భాంతికి గురిచేశాయని అన్నారు. రాజ్యసభ సభ్యుడు మూడు కొత్త క్రిమినల్ చట్టాలను 'పార్ట్–టైమర్స్' రూపొందించారని అనడం, పార్లమెంటు యోచననే అవమానించేదిగా ఉందని ధన్ఖర్ తెలిపారు. కాంగ్రెస్ నాయకుడు పి.చిదంబరం 'ది ఇండియన్ ఎక్స్ ప్రెస్' కు ఇచ్చిన ఇంటర్వ్యూలో జులై 1 నుంచి అమలులోకి వచ్చిన కొత్త చట్టాలు 'నాన్–ప్రొఫెషనల్ వాళ్లు' రూపొందించిందని అన్నారు. పైగా వారు 'కమిటీ పార్ట్–టైమర్స్ సభ్యులు' అని వ్యాఖ్యానించారు. తిరువనంతపురంలోని 'ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ' (ఐఐఎస్టి) 12వ స్నాతకోత్సవంలో ధన్ఖర్ ప్రసంగిస్తూ, డిసెంబర్ 2023లో పార్లమెంట్ ఆమోదించిన మూడు బిల్లులపై చర్చలో పాల్గొననందుకు చిదంబరం పేరు చెప్పకుండానే ఆయనపై విరుచుకుపడ్డారు. భారతీయ న్యాయ సంహిత 2023, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత 2023, భారతీయ సాక్ష్యా అధినియం 2023 లు భారతీయ శిక్షాస్మృతి 1860, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 1973, మరియు ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ 1972 స్థానంలో కొత్తగా వచ్చాయి .చిదంబరం వ్యాఖ్యలపై స్పందించిన ధన్ఖర్ "నేను మాటల్లో చెప్పలేనంతగా షాక్ అయ్యాను, అందువల్ల, ఉద్దేశపూర్వకంగా, వ్యూహాత్మకంగా, కథనం ద్వారా మన దేశాన్ని కించపరిచే, మన సంస్థలను కించపరిచే, మన పురోగతిని కించపరిచే, గోడపై రాత చూడని మనస్సుల పట్ల దయచేసి జాగ్రత్త వహించండి? విమర్శల కోసమే విమర్శలకు దిగుతున్నారు. ఇలాంటి కథనాలను ఖండిస్తున్నట్లు చెప్పడానికి నా దగ్గర పదాలు లేవు " అని ధన్ఖర్ అన్నారు.

ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలి - డాక్టర్ లిల్లీ మేరి

సిద్దిపేట జులై 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్ : వర్షాకాల సీజన్లో వ్యాధుల విజృంభణకు ప్రధాన కారణంగా నిలుస్తుంది. చినుకుపడితే చాలు క్రిమికీటకాలు ప్రజలపై దాడులు చేస్తాయి. ఆ దాడులలో పెద్దలకంటే పిల్లలకే ఎక్కువ ప్రమాదకర వ్యాధులు ప్రబలుతాయి. కలరా, విరోచనాలు, అతిసార, టైఫాయిడ్, పచ్చకామెర్లు, విష జ్వరాలు, చికెన్ గున్యా వంటి వ్యాధులు ఈ కాలంలో ఎక్కువగా ప్రబలే అవకాశం ఉంది. తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల వ్యాధుల బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంటుందని ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరు జాగ్రత్తగా తీసుకోవాలి అని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లిల్లీ మేరి ప్రజలకు పలు సూచనలు సలహాలు చేశారు.

అతిసార వ్యాధి:

చిన్నపిల్లల్లో వచ్చే అంటూ వ్యాధులు అన్నిటిలోనూ సుమారు 60-70 శాతం డయేరియా ఆక్రమిస్తుంది అనడంలో అతిశయోక్తి కాదు. నిజానికి డయేరియా లేదా అతిసార వ్యాధి చిన్నపిల్లల ప్రాణాలు తీయడంలో అగ్రస్థానంలో ఉందని లెక్కలు చెబుతున్నాయి. 23 శాతం చిన్న పిల్లలు ఈ కారణంగానే మరణిస్తున్నట్లు సంఘటనలు రుజువు చేస్తున్నాయి.

లక్షణాలు ఇవి:

వాంతులు, విరోచనాలు, కడుపునొప్పి, దాహము, నోరు ఎండిపోవటము, చర్మము సాగే గుణం కోల్పోవడం, మూత్ర విసర్జన తగ్గిపోవడం.

నివారణ చర్యలు:

వ్యాధి రాక ముందు క్లోరిన్ కలిపిన నీరు సరఫరా అవుతున్నది లేనిది చూడాలి. గ్రామీణ నీళ్ల ట్యాంకులలో బ్లీచింగ్ పౌడర్ కలుపుతున్నారా లేదా అనేది పరిశీలించాలి. ఇళ్లలో నీరు కాచి చల్లార్చి వాడే అలవాటు చేసుకోవాలి. చేతులు ముంచకుండా బిందెలలో నీరు వాడకుండా కేవలం కాడ గిన్నెతో నీటిని తీసుకునే అలవాటు చేసుకోవాలి. సంబంధిత అధికారుల సమన్వయంతో పగిలిన పైపులను మరమ్మతులు చేయించుకోవాలి. చేతి పంపులు, కులాయిల చుట్టూ ఎత్తైన ప్లాట్ ఫార్మ్ నిర్మించుకోవాలి. మరుగుదొడ్ల వాడకాన్ని అలవాటు చేసుకోవాలి. ఓఆర్ఎస్ ప్యాకెట్లు నిల్వ ఉంచుకోవాలి అని డాక్టర్ లిల్లీ మేరి అన్నారు.

పచ్చకామెర్లు:

హెపటైటిస్ ఏ, బి వైరస్ల వల్ల ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. రోగి మలముతో కలుషితమైన నీరు ఆహారము ద్వారా వ్యాపిస్తాయి.

వ్యాధి లక్షణాలు:

జ్వరము, ఆకలి లేకపోవడం, కళ్ళు, చర్మం పసుపు పచ్చగా మారడం.

నివారణ చర్యలు:

ఖచ్చితమైన చికిత్స అనేది లేదు. రోగుల లక్షణాలను బట్టి చికిత్స అవసరం అవుతుంది. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. సురక్షితమైన నీటిని మాత్రమే తాగాలి. వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

కలరా:

కలరా పేగులకు సంబంధించిన ప్రమాదకర వ్యాధి. విబ్రియో కలరా అనే సూక్ష్మ క్రిమి వలన ఈ వ్యాధిని వ్యాపిస్తుంది. ఈ వ్యాధి సోకిన రోగి విసర్జిత మలములోను వాంతిలోనూ రోగ క్రిములు ఉంటాయి. ఈ క్రిములు కలిసిన ఆహారము, నీరు ద్వారా త్వరితగతిన ఇతరులకు వ్యాప్తి చెందే ప్రమాదం ఉంది. పరిశుభ్రత లోపించిన ప్రదేశాల్లో కలరా అంటువ్యాధిగా వ్యాపిస్తుంది. మలము, ఈగల ద్వారా కూడా ఈ వ్యాధి వ్యాపించే అవకాశం ఉంది.

ఇవి లక్షణాలు:

రోగి హఠాత్తుగా అస్వస్థతకు గురవుతాడు. అన్నం గంజి రంగులో పదేపదే నీళ్ల విరోచనాలు చేసుకుంటాడు. నీళ్ల వెంట వెంట వాంతులు కూడా అవుతాయి. రోగికి తీవ్రమైన దాహం వేస్తుంది. చర్మం చల్లగా, పొడిగా తయారవుతుంది. కళ్ళు పీకటం, మూత్రం ఆగిపోవచ్చు. రోగికి సకాలంలో చికిత్స చేయించకపోతే మరణించవచ్చు.

ఇలా నివారించవచ్చు:

కాచి వడపోసిన నీటిని తాగాలి. చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. ఈగలు వాలకుండా ఉండేందుకు ఆహార పదార్థాలపై మూతలు పెట్టి ఉంచాలి. వ్యాధి వ్యాప్తి చెందకుండా పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలి. శుభ్రమైన నీటితో పాత్రలను కడగాలి.

నీళ్ల విరోచనాలు:

వ్యాధికారక క్రిమి రోటా వైరస్ వల్ల నీళ్ల విరోచనాలు ఏర్పడతాయి.

వ్యాధి లక్షణాలు:

విరోచనాలు, వాంతులు, కడుపునొప్పి, దాహము, నోరు ఎండిపోవడం, చర్మం సాగే గుణం కోల్పోవడం, మూత్రవిసర్జన తగ్గిపోవడం.

నివారణ చర్యలు:

వేడిగా ఉన్న ఆహార పదార్థాలను తినాలి. కాచి వడపోసిన నీటిని మాత్రమే తాగాలి. మల విసర్జన చేసిన తర్వాత, ఆహారం తీసుకునే ముందు ప్రతిసారి సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవాలి. చేతిపంపులు, కులాయిల చుట్టూ ఎత్తైన ప్లాట్ ఫామ్ లను ఏర్పాటు చేసుకోవాలి. మరుగుదొడ్లను తప్పనిసరిగా వాడాలి. బహిరంగ మల,మూత్ర విసర్జన చేయకుండా జాగ్రత్త పడాలి అని డాక్టర్ లిల్లీ మేరి తెలిపారు.

టైఫాయిడ్:

టైఫాయిడ్ వ్యాధి సాల్మొనెల్ల టైఫీ అనే బ్యాక్టీరియా ద్వారా టైఫాయిడ్ వ్యాధి సోకుతుంది. రోగి మలముతో కలుషితమైన నీరు, ఆహారము, ఆరోగ్యంగా కనిపించే వాహకుల మలము ద్వారా కూడా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది.

వ్యాధి లక్షణాలు:

జ్వరము, విరోచనాలు, పేగుల్లో పుండు(అల్సర్)

నివారణ చర్యలు:

బయట విక్రయించే ఆహార పదార్థాలను తినకూడదు. కాచి చల్లార్చి వడపోసిన నీటిని లేదా క్లోరిన్ కలిపిన నీటిని మాత్రమే తాగాలి. గోళ్లను కత్తిరించుకోవాలి. వంట చేసే ముందు లేదా ఆహారము తినేముందు మల విసర్జన చేసిన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రపరుచుకోవాలి. వ్యాధిగ్రస్తుల బట్టలను వేడి నీటిలో లేదా ఫినాయిల్ కలిపిన నీటిలో ముంచి ఉతకాలి అని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లిల్లీ మేరి పేర్కొన్నారు.

ప్రపంచంలో మూడో అత్యంత కాలుష్య దేశంగా భారత్ ఉండటం సిగ్గుచేటు

- 10 ఏళ్లుగా "స్వచ్ఛ" గగ్గోలు సాధించిదేమిటి?

- ఇకనైనా ప్రభుత్వాలు మేల్కొనాలి!

- ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ ఆవేదన.

హైదరాబాద్ , జూలై 06 (ఎక్స్ ప్రెస్ న్యూ స): పాలకులకు, రాజకీయ పార్టీలకు ఓటు కోసం పాట్లు తప్ప కాలుష్యంపై జనానికి అవగాహన కల్పించడంలో గానీ, అధికారంలో ఉన్న ప్రభుత్వాలు కాలుష్యాన్ని తగ్గించడంలో గానీ చొరవతీసుకోకపోవడం అత్యంత బాధాకరమని ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ ఆవేదన వ్యక్తం చేసింది. శనివారం కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్సీహెచ్ రంగయ్య బాగ్ లింగం పల్లిలోని కౌన్సిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ..గడచిన పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం నుంచి స్థానిక ప్రభుత్వాల వరకు స్వచ్ఛ భారత్, స్వచ్ఛ తెలంగాణ -ఆంధ్ర, స్వచ్ఛ హైదరాబాద్ -అమరావతి. ..ఇంకా అవి చెప్పిన స్వచ్ఛ స్లోగన్ లు వట్టి అబద్ధాలని తెలిపోయాయని విమర్శించారు. తాజాగా "లాన్సెట్" సంస్థ ప్రపంచ వాయు కాలుష్యం పై చేసిన అధ్యయనంలో కాలుష్య నిలువల్లో భారత్ ప్రపంచంలోనే మూడో స్థానంలో నిలవడం స్వచ్ఛత పేరుతో ప్రభుత్వాలది హడావిడి తప్ప మరేమి లేదని తేలిపోయిందన్నారు. 2008-19 మధ్య కాలంలో ప్రతి యేటా మన దేశంలో సగటున 33వేల మంది చనిపోవడం ప్రభుత్వాలు సిగ్గుతో తల దించుకోవాల్సిన విషయమన్నారు. కళ్ళముందే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కుప్పలు తెప్పలుగా భయపెడుతున్నా పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం బాధాకరమన్నారు. మరోవక్క రసాయన వ్యర్థాలు, పెస్టిసైడ్, ఫర్టిలైజర్ నియంత్రణ లేని వాడకం జరుగుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వాలు కాలుష్యాలు నిలువరించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. తక్షణమే బయో డిగ్రేడబుల్ ప్లాస్టిక్ ఇండస్ట్రీ రంగాన్ని బలోపేతం చేసి ప్లాస్టిక్ సింగిల్ యూజ్ నియంత్రణ చేయాలని కోరారు. మరోవైపు తెలంగాణ సర్కారు నల్లమలలో తలపెట్టిన ప్రకృతి పర్యాటక ఆలోచన విరామించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఒకవైపు కాలుష్యాలతో నానాటికీ దిగజారుతున్న భారత్ ఇలాంటి అటవీ పర్యాటకంతో మరింత పాతాలానికి పడిపోయే ప్రమాదముందని హెచ్చరించారు.

బస్సులో పురుడుపోసిన మహిళా కండక్టర్‌కు సన్మానం.. ఆ చిన్నారికి జీవితకాలపు ఉచిత బస్ పాస్ ప్రకటన

హైదరాబాద్, జులై 6 :ఆర్టీసీ బస్సులో గర్భిణికి పురుడుపోసి మానవత్వం చాటుకున్న సంస్థ సిబ్బందిని టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం అభినందించింది. హైదరాబాద్ బస్ భవన్‌లో శనివారం ఉన్నతాధికారులతో కలిసి సంస్థ ఎండీ వీసీ సజ్జనర్ వారిని ఘనంగా సన్మానించారు.బస్సులో జన్మించిన చిన్నారికి తమ బస్సుల్లో జీవిత కాలం ఉచితంగా ప్రయాణించేలా బస్ పాస్‌ను అందిస్తున్నట్లు ప్రకటించారు. ఆర్టీసీ బస్సులు, బస్ స్టేషన్‌లలో పుట్టిన పిల్లలకు జీవిత కాలపు ఉచిత బస్ పాస్‌ను ఇవ్వాలని గతంలో యాజమాన్యం తీసుకున్న నిర్ణయం మేరకు.. ఈ ఆడబిడ్డకు బర్త్ డే గిఫ్ట్‌గా లైఫ్ టైం ఫ్రీ బస్ పాస్‌ను మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు.

హైదరాబాద్‌లోని ముషీరాబాద్ డిపోకు చెందిన 1 జెడ్ రూట్ బస్సులో శుక్రవారం ఉదయం శ్వేతా రత్నం అనే గర్భిణీ ఆరాంఘర్‌లో ఎక్కారు. బహదూర్‌పుర వద్దకు రాగానే ఆమెకు పురిటి నొప్పులు తీవ్రమయ్యాయి. ఈ విషయాన్ని గమనించిన కండక్టర్ ఆర్.సరోజ అప్రమత్తమై మహిళా ప్రయాణికుల సాయంతో సాధారణ ప్రసవం చేశారు. ఆమె పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చారు. డెలివరీ అనంతరం అనంతరం మెరుగైన వైద్యం కోసం బస్సులోనే సమీపంలోని గవర్నమెంట్ మెటర్నటీ ఆస్పత్రికి తరలించారు. తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు.

సమయస్ఫూర్తితో స్పందించి.. సకాలంలో కాన్పు చేసిన కండక్టర్ సరోజ సేవలను ఈ సందర్భంగా టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ ప్రశంసించారు. ఏ మాత్రం ఆలస్యం చేయకుండా తల్లీబిడ్డను బస్సులోనే మెటర్నటీ ఆస్పత్రికి తీసుకెళ్లిన డ్రైవర్‌ను కూడా అభినందించారు. కండక్టర్ చాకచక్యంగా వ్యవహరించడంతోనే తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నారని అన్నారు.

ఈ సన్మాన కార్యక్రమంలో సంస్థ సీవోవో డాక్టర్ రవిందర్, జాయింట్ డైరెక్టర్ అపూర్వ రావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, కృష్ణకాంత్, హైదరాబాద్ ఆర్ఎం వరప్రసాద్, ముషీరాబాద్ డీఎం కిషన్, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి.. హైకోర్టు జడ్జి సుజోయ్ పాల్ హితవు

-న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

నిజామాబాద్, జులై 6 :భవిష్యత్తును అంధకారంగా మారుస్తూ జీవితాన్ని నాశనం చేసే మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని రాష్ట్ర హైకోర్టు జడ్జి, తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ సుజోయ్ పాల్ హిత వు పలికారు. ప్రత్యేకించి ఉజ్వల భవిత కలిగిన విద్యార్థులు మత్తు పదార్థాల వైపు మళ్లకుండా, తమ లక్ష్యం దిశగా అకుంఠిత దీక్షతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నిజామాబాద్ జిల్లా న్యాయసేవా ధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నిర్మూలన అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. జస్టిస్ సుజోయ్ పాల్ ముఖ్య అతిథిగా హాజరు కాగా హైకోర్టు జడ్జి శ్రీసుధ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి పంచాక్షరీ, జిల్లా సెషన్స్ జడ్జి సునీత కుంచాల, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో హైదరాబాద్ జోనల్ డైరెక్టర్ సచిన్ గోర్పడే, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జస్టిస్ సుజోయ్ పాల్ మాట్లాడుతూ? తాము చదువుకునే రోజుల్లో విద్యార్థుల ఆత్మహత్యలు ఉండేవి కావని, డ్రగ్స్ అనే పదమే వినిపించేది కాదన్నారు. కానీ నేడు అనేకమంది విద్యార్థులు డ్రగ్స్ కు అలవాటుపడి మానసిక కుంగుబాటుకు లోనవుతూ బలవన్మరణాలకు పాల్పడుతుండడం ఆందోళన కలిగించే అంశంగా మారిందన్నా రు. అందుబాటులోకి వచ్చిన అధునాతన సాంకేతికత, సమాచార విప్లవంతో విజ్ఞాన పరమైన అనేక అంశాలను తెలుసుకునే వెసులుబాటు ఏర్పడిందని, అదే సమయంలో యువత, విద్యార్థులు పెడద్రోవ పట్టేందుకు కూడా ఇవి కారణభూతంగా నిలుస్తున్నాయని అభిప్రాయపడ్డారు.

ఆత్మవిశ్వాసంతో గమ్యం దిశగా ముందుకు సాగాలి..

స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పర్చుకుని నిరంతర కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో గమ్యం దిశగా ముందుకు సాగాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. లక్ష్యం వైపు పయనించే క్రమంలో ఎదురయ్యే అపజయాలు, ప్రతీకూల పరిస్థితులను చూసి ఎంతమాత్రం వెనుకంజ వేయకూడదని, జీవితంలో గెలుపోటములు ఒకే నాణానికి రెండు పార్శ్వాలు వంటివని ఉద్బోధించారు. విద్యార్థి దశ నుండే క్రీడలు, వ్యాయామాలు వంటివి ఆచరిస్తే, గెలుపోటములను సమానంగా స్వీకరించే మానసిక స్థైర్యం అలవడుతుందని అన్నారు. వివిధ రంగాలలో ఉన్నత స్థానాలకు చేరిన వారిని స్ఫూర్తిగా తీసుకుంటూ, మన లోపాలను సరిదిద్దుకుని ముందుకెళ్తే తప్పనిసరిగా అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని హితబోధ చేశారు.

నేటి తరం పిల్లలు, చిన్నచిన్న కారణాలకే మానసిక సమతుల్యాన్ని కోల్పోతున్నారు.. :హైకోర్టు జడ్జి పి.శ్రీసుధ

బాధ్యతల భారం తెలియని నేటి తరం పిల్లలు, చిన్నచిన్న కారణాలకే మానసిక సమతుల్యాన్ని కోల్పోతున్నారని, హైకోర్టు జడ్జి పి.శ్రీసుధ అన్నారు. అలాంటి వారు ఎంతో సులభంగా డ్రగ్స్ వైపు మొగ్గుచూపుతూ వాటికి బానిసలుగా మారి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాల పట్ల అప్రమత్తంగా ఉంటూ, తమను తాము పరిరక్షించుకోవాలని సూచించారు. ఎవరైనా డ్రగ్స్ కు అలవాటుపడినట్లు గమనిస్తే, వెంటనే వారి తల్లిదండ్రులకు ఈ విషయాన్ని తెలియజేయాలని, దీనిని సామాజిక బాధ్యతగా గుర్తించాలని సూచించారు.

ఈ సందర్భంగా మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, వాటికి దూరంగా ఉండేందుకు అనుసరించాల్సిన పద్ధతులు, డ్రగ్స్ వినియోగం, వాటిని కలిగి ఉండడం వల్ల ఎదుర్కోవాల్సి వచ్చే శిక్షలు తదితర అంశాల గురించి నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో హైదరాబాద్ జోనల్ డైరెక్టర్ సచిన్ గోర్పడే పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా సవివరంగా తెలియజేశారు. డ్రగ్స్ శారీరక, మానసిక దౌర్బల్యతను కలిగించడమే కాకుండా, సమాజానికి కూడా ఎంతో హానికారకంగా మారాయన్నారు. కాగా, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న సామాజిక కార్యక్రమాల గురించి జిల్లా జడ్జి సునీత కుంచాల వివరించారు. ఈ సదస్సులో న్యాయాధికారులు, వివిధ పాఠశాల, కళాశాలల విద్యార్థిని, విద్యార్థులు, ఆయా శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

భద్రకాళి శాఖంబరి నవరాత్రి మహోత్సవములు.



హన్మకొండ, జులై 6:(నేటినిజం ప్రతినిధి) వరంగల్ మహానగరంలోని చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానంలో శాకంబరీ నవరాత్ర మహోత్సవములు శనివారం రోజున అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 04-30లకు నిత్యాహ్నికం పూర్తయిన పిమ్మట అమ్మవారికి ఉత్సవానుజ్ఞ ప్రార్థన జరిపి అమ్మవారి నుండి అనుమతి వచ్చిన మేరకు ఉత్సవ కార్యక్రమాలను ప్రారంభించారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం, ఉత్సవ పూర్వాంగ విధి అర్చకులు నిర్వహించారు. ఉదయం 9 గంటలకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి - నీలిమ దంపతులు జ్యోతి ప్రజలను చేసి ఉత్సవాలను ఎంతో వైభవంగా ప్రారంభించారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి దంపతులకు ఆలయ ఈవో శేషు భారతి, ప్రధాన అర్చకులు భద్రకాళి శేషులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా వల్లభ గణపతిని దర్శించిన అనంతరం ఆలయంలోకి ప్రవేశించి జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. అర్చకులు సహస్ర కళాశాభిషేక ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా గ్రహమఖం మూలమంత్ర హోమం, శాంతి హోమం నిర్వహించిన తదుపరి అమ్మవారికి దాదాపు రెండు గంటల సేపు ఒక వెయ్యి ఎనిమిది కలశాలతో అభిషేకం నిర్వహించారు. అభిషేకం జరుగుతున్నంత సేపు భక్తులు తనయత్వంతో ఒక దివ్యభూతిని పొందారు. భక్తులంతా సహస్ర కలశాభిషేక అనుభూతిని ఒకరితో ఒకరు పంచుకున్నారు. అనంతరం అమ్మవారి షాడ్బాలలో అమ్మవారికి ఎదురుగా ఉన్న బేరాన్ని కాళీమాత గా మహా మండపంలో బేరాన్ని కామేశ్వరి మాత గా అలంకరించి పూజారాధనలు జరిపారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తీసుకోవాలి : మంత్రి రాంప్రసాద్ రెడ్డి

అమరావతి, జులై 6 :: ప్రతి ఒక్కరూ రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని ఏపీ రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి కోరారు. ముఖ్యంగా మైనర్లు వాహనాలు ఇచ్చి ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా రామాపురం మండలం కొండవాండ్లపల్లి వద్ద కారు అదుపుతప్పి టిప్పర్‌ను ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడే మరణించారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న మంత్రి సంఘటనా స్థలాన్ని సందర్శించి ప్రమాద వివరాలను పోలీసులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కడప జిల్లాకు చెందిన యువకులు అంజినా యక్ (29), షేక్ అలీమ్ (32), జితేంద్ర (22), షేక్ అఫ్రోజ్ (30) ప్రమాదంలో మరణించారని, షేక్ ఖాదర్ బాషా (20) అనే యువకుడు గాయపడ్డాడని, అతని పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. ముఖ్యంగా మైనర్లు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలను నడుపుతున్నారని , వీటిని అరికట్టాలని ఆదేశించారు. ప్రమాదాలు జరుగకుండా ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు దహన సంస్కరాల కోసం లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.

కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన మూడు క్రిమినల్ కొత్తచట్టాలను సవరించాలి

- ఖమ్మం జిల్లా బార్ అసోసియేషన్

ఖమ్మం, జులై 6 :(నేటినిజం ప్రతినిధి): ఖమ్మం కోర్టు ప్రాంగణం

నందు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు క్రిమినల్ కొత్త చట్టాలను సవరించాల ని ఖమ్మంజిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రిలే నిరాహార దీక్షకు సంఘీభావం తెలిపిన ఖమ్మం నగర బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పగడాల నాగరాజు, జిల్లా నాయకులు గుండాల కృష్ణ అనంతరం వారు మాట్లాడుతూ... 10సంవత్సరాలలో కేంద్రప్రభుత్వం అనేకమైన ప్రజా వ్యతిరేకమైన చట్టాలను తీసుకొచ్చి ప్రజలను ఇబ్బందులకు గురిచేసింది ఈ సంగతిని ప్రజలు తెలుసుకోవాలని అన్నారు. గతంలో రైతు వ్యతిరేక నల్ల చట్టాలను తీసుకొచ్చినందుకు రైతులు రోడ్డెక్కి పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తే వారిని జీపులతో ఎక్కించి చంపినటువంటి సంఘటన ను కూడా ఒకసారి మనం గుర్తు చేసుకోవాలని అన్నారు. కార్మిక వ్యతిరేక చట్టాలను మోటార్ వాహనాలు చట్టాలను తీసుకొచ్చింది ఇలా అనేక రకాలుగా ప్రజలను ఇబ్బంది పెడుతూనే ఉంది కాబట్టి ఆ రైతులు చేసినటువంటి దీక్షను ఆదర్శంగా తీసుకొని మనందరం ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. తెలంగాణలో అన్ని జిల్లాల్లో కంటే మన ఖమ్మం జిల్లాలో న్యాయవాదులు పెద్ద ఎత్తున రిలే నిరాహార దీక్షలు చేస్తున్నందుకుగాను ప్రజల పట్ల వారికి ఉన్నటువంటి కమిట్మెంట్ చాలా గొప్పదని కొనియాడారు. మీారు చేసేటువంటి ఈ దీక్షకు బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడు మీా వెన్నంటే ఉంటుందని చెప్పి సంఘీభావం తెలియజేస్తు వారికి నిమ్మరసాలు ఇచ్చి నిరాహార దీక్షను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, బీఆర్ఎస్ పార్టీ లీగల్ సేల్ నాయకులు, బిచ్చాల తిరుమలరావు, మేకల సుగుణ రావు, రాంబాబు, నిరోషా తదితరులున్నారు.

కాంగ్రెస్ డిక్లరేషన్లు అని ఉత్తమాటలేనా?! .. ఎమ్మెల్యే ధనపాల్

నిజామాబాద్, జులై 6 : కాంగ్రెస్ డిక్లరేషన్లు అని ఉత్తమాటలేనా ? అని అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్య నారాయణ ఎద్దేవా చేశారు. శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం, రేవంత్ సర్కార్ ఎన్నికల ముందు హైదరాబాద్ యూత్ డిక్లరేషన్లో తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమంలో ప్రాణాలర్పించిన వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, తల్లి ,తండ్రి ,భార్యకు 25000 గౌరవ పెన్షన్ ఇస్తానని చెప్పింది. కానీ ఇప్పటి వరకు దాని ఊసే లేదని, ప్రతి ఏడాది జూన్ 2నాటికే అన్ని శాఖల్లో జాబ్ క్యాలండర్ ప్రకటించి సెప్టెంబర్ 17 లోపు నియామకాలు చేపడుతామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు జాబ్ క్యాలండర్ విడుదల చేయలేదని మండిపడ్డారు.

సెప్టెంబర్ లోపు నియామకాలు ఎలా చేపడతారని ప్రశ్నించారు. మొదటి ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు అని చెప్పి మెగా డీఎస్సీ అని చెప్పి 7 నెలలు గడుస్తున్నా నియామకాలు పూర్తి స్థాయిలో జరగడగం లేదన్నారు. మెగా డీఎస్సీని వెంటనే విడుదల చేయాలని బీజేవైఎం కార్యకర్తలు నిరసనలు చేస్తే పోలీసులతో నిర్బంధించి, ముందస్తు అరెస్టులు చేసి, పలు చోట్ల లాఠీ ఛార్జ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా మన్నారు. వెంటనే మెగా డీఎస్సీ నిరుద్యోగులకు న్యాయం చేయాలన్నా రు. పోలీసులు తమ వైఖరి మార్చుకోపోతే పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయనీ అన్నారు.కామారెడ్డి బీసీ డిక్లరేషన్ పేరుతో కుల గణన, బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా అధికారంలో వచ్చిన 6 నెలలో పే బీసీ రిజర్వేషన్లు పెంపోం దిస్తామని అలాగే కొత్త స్థానిక సంస్థల్లో ప్రస్తుతం ఉన్న ఃఅ రిజర్వేషన్ 23% నుండి 42% కి పెంచుతాం అన్న హామీని వెంటనే అమలు చేయాలనీ డిమాండ్ చేసారు. అలాగే అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ళ కేటాయింపు హామీ హామీగానే ఉందని గత ప్రభుత్వం ఇల్లు నిర్మించి ఇస్తానని 10 ఏళ్ళు మోసం చేసి, కాంగ్రెస్ రేవంత్ సర్కార్ కూడా అదే తోవలో పోతుందని అన్నారు.పాత కలెక్టర్ కార్యాలయంలో 12 ఎకరాలలో స్పోర్ట్స్ స్టేడియం నిర్మించాలని జిల్లాలో జాతీయ స్థాయి క్రీడాకారులు ఉన్నారని, వారికి ఉపయోగకరంగా ఉంటుందని భోధన్ బస్టాండ్ కాంప్లెక్స్ వంటి సమస్యలపై జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మినారాయణ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి న్యాలం రాజు, కార్పొరేటర్స్ ఎరం సుధీర్, మాస్టర్ శంకర్, మరియు అసంబ్లీ కో కన్వీనర్ నారాయణ యాదవ్, బీజేపీ ఆఫీస్ సెక్రటరీ బద్దం కిషన్, మండల అధ్యక్షులు గడ్డం రాజు,పుట్ట వీరేందర్, బీజేపీ నాయకులు, ప్రభాకర్,ఆనంద్, పవన్, కార్తీక్, ఖైజార్, అంబదాన్,హరీష్, భూమేష్, వెంకటరమణ పాల్గొన్నారు.

ఏపీకి త్వరలోనే ప్రత్యేక హోదా వస్తుంది.. చింతా మోహన్ ఆసక్తికర వ్యాఖ్యలు

అమరావతి, జులై 6 : ఏపీకి త్వరలోనే ప్రత్యేక హోదా వస్తుందని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ తెలిపారు. రాష్ట్ర విభజనకు కాంగ్రెస్ కారణం కాదని.. ఏపీ మాజీ సీఎం జగనే కారణమని అన్నారు. జగన్ కాంగ్రెస్ పార్టీతోనే ఉండి ఉంటే.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన జరిగి ఉండేది కాదని వ్యాఖ్యానించారు.

తిరుమలలో గత ఐదేళ్లుగా ఇచ్చిన వీఐపీ బ్రేక్ దర్శనం వివరాలను బయటపెట్టాలని చింతా మోహన్ డిమాండ్ చేశారు. తిరుమల జూ పార్క్‌ను వడమాలపేటకు తరలించి.. ఇక్కడ టీటీడీ ఉద్యోగులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరారు. తిరుపతిలో క్రికెట్ స్టేడియం కోసం తాను ఎంపీగా ఉన్నప్పుడు అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డితో కలిసి పునాది రాయి వేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ క్రికెట్ స్టేడియం నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే తిరుపతిలోని పది ప్రాంతాల్లో పిల్లలకు ఆట స్థలాలను ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకు కార్పొరేషన్ కమిషనర్ టాప్ ప్రియారిటీ ఇవ్వాలని సూచించారు.

ఆషాఢం బోనాల జాతర

బోనాల పండు ప్రస్తావన:

తెలంగాణ ప్రాంతం, ముఖ్యంగా భాగ్యనగరంలో ఆషాఢ మాసం బోనాల జాతర సందడి మొదలైంది. ఈ ఏడాది జ్యేష్ఠమాస అమావాస్య జూలై 5 శుక్రవారం వచ్చింది...అంటే జూలై 6 శనివారం నుంచి ఆషాఢ మాసం ప్రారంభమవుతుంది. జూలై 7 ఆషాఢంలో వచ్చే మొదటి ఆదివారం రోజు భాగ్యనగరంలో బోనాల సంబరం ప్రారంభమవుతుంది. గోల్గొండ శ్రీ ఎల్లమ్మ ఆలయంలో తొలిపూజ నిర్వహించిన తర్వాత సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి, లాల్ దర్వాజ మహంకాళి ఆలయంలో నెలరోజుల పాటూ ప్రతి గురువారం, ఆదివారం ప్రత్యేక పూజలు జరుగుతాయి...మళ్లీ గోల్గొండ కోటలోనే చివరి రోజు పూజ నిర్వహించడంతో ఉత్సవాలు ముగింపు ఉంటుంది. ఈ బోనాల జాతర వరుసగాజూలై 7 ఆదివారం – గోల్గొండ జగదాంబికకు తొలిబోనం సమర్పణతో ఉత్సవాలు ప్రారంభం. జూలై 11 గురువారం – రెండో పూజ, జూలై 14 ఆదివారం – మూడో పూజ, జూలై 18 గురువారం – నాలుగో పూజ, జూలై 21 ఆదివారం – ఐదో పూజ, జూలై 25 గురువారం – ఆరోపూజ, జూలై 28 ఆది వారం – ఏడో పూజ, ఆగష్టు 1 గురువారం – ఎనిమిదో పూజ, ఆగష్టు 4 ఆదివారం – తొమ్మిదో పూజ.

అంటే జూలై 7 ఆదివారంతో మొదలయ్యే బోనాలు...ఆగష్టు 4 ఆదివారంతో ముగుస్తాయి. అదే రోజు ఆషాడమాస అమావాస్య... ఆగష్టు 5 సోమవారం నుంచి శ్రావణమాసం ప్రారంభమవుతుంది. ఢిల్లీలో తెలంగాణ భవన్ లో 3 రోజులు బోనాల వేడుకలు. లాల్ దర్వాజా సింహవాహిని శ్రీ మహంకాళి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఏటా ఢిల్లీలో తెలంగాణ భవన్ లో బోనాల ఉత్సవాలు జరుగుతాయి. ఈ ఏడాది కూడా జూలై 8,9,10 తేదీల్లో మూడు రోజుల పాటూ తెలంగాణ రాష్ట్రప్రభుత్వం తరఫున ఉత్సవాలు జరగనున్నాయి.

ఆషాఢ మాసంలో అమ్మవారు తన పుట్టింటికి వెళుతుందని భక్తుల విశ్వాసం... అందుకే అమ్మను తమ ఇంటి ఆడబిడ్డలా భావించి భక్తి శ్రద్ధలతో పూజించి నైవైద్యాలు సమర్పిస్తారు. అప్పట్లో బోనాల పండుగ ప్రారంభించే సమయంలో దుష్టశక్తులను తరిమేసేందుకు దున్నపోతుని బలిచ్చేవారు. ఇప్పుడు దున్నపోతుకి బదులు కోడి, మేకలను బలిస్తున్నారు. బోనాలు తీసుకెళ్లే మహిళలపై అమ్మవారు ఉంటుందని భక్తుల నమ్మకం..అందుకే బోనంపట్టుకున్న మహిళలు ఆలయాన్ని సమీపించగానే పాదాలపై నీళ్లుచల్లి నమస్కరిస్తారు. హైదరాబాదులోని జగదాంబిక అమ్మవారి ఆలయం తొలి బోనం సమర్పిస్తారు.. రెండో బోనం బల్కంపేట రేణుక ఎల్లమ్మ గుడిలో, మూడో బోనం సికింద్రాబాదులోని ఉజ్జయిని మహంకాళి ఆలయంలో ఇస్తారు.

ఆషాఢంలోనే బోనాల పండుగ జాతర ఎందుకు జరుపుకుంటారు:

ఆషాఢమాసంలో వర్షాల కారణంగా అంటువ్యాధులు విజృంభిస్తాయి. వైరస్‌లు వ్యాప్తి చెందుతాయి. ఈ వ్యాధుల నుంచి కాపాడి ఆరోగ్యాన్ని ప్రసాదించమ్మా అంటూ గ్రామదేవతలను ఆరాధిస్తారు. పూజకోసం ఉపయోగించే వస్తువులైన వేపాకులు, పసుపు నీళ్ల క్రిమికీటకాలు ఇవన్నీ వైరస్‌ను తరిమికొడతాయని అంతర్గతంగా భక్తుల విశ్వాసంతో జరుపుకునే బోనాల పండుగ జాతర కోలహలంగా ప్రారంభం అవుతుంది.

బోనాలు పండుగ ప్రాముఖ్యత :

బోనాలు హైందవ సంస్కృతిలో తెలంగాణ ప్రాంతవాసులు భక్తి శ్రద్ధలతో జరుపుకునే పండుగ. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి దేవతను సేవించటానికి, హైదరాబాద్, సికింద్రాబాద్ నలుమూల నుండి జనం తండోపతండాలు తరలివచ్చి మహంకాళి అమ్మవారికి బోనం సమర్పించి పండుగను ఘనంగా జరుపుకుంటారు. ప్రతి ఏడాది ఈ పండుగను జరుపుకోనేందుకు నేపథ్యం ఏమిటంటే.... బోనాలు పండుగ ప్రాశస్త్యము పండుగ చరిత్ర 1813లో హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో ప్లేగు వ్యాధి వ్యాప్తి చెందడంతో వేలాది మంది ప్రాణాలు కోల్పోతుంటే సైనిక బెటాలియన్లు ఉజ్జయిన్లు మోహరించారు. హైదరాబాద్‌లో ప్లేగు వ్యాధి మరింతగా వ్యాప్తి చెందడంతో ప్రజలు ఆందోళన చెందుతున్న క్రమంలో, ఆ పరిస్థితుల్లో మిలిటరీ బెటాలియన్ మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని మహాకాళి ఆలయంలోని మాతృదేవతకు ప్రార్థనలు చేసి, ప్రజల అంటువ్యాధుల నుండి విముక్తి పొందడం కొరకు మహంకాళి విగ్రహాన్ని సికింద్రాబాద్ మోండా మార్కెట్‌గా ప్రసిద్ధిచెందిన ఆ ప్రదేశంలో ఉన్న దేవాలయంలో ఉజ్జయిని మహంకాళిని ప్రతిష్ఠించడంతో, నాటినుండి జంటనగరాల నలుమూలల నుండి భక్తులు అశేషంగా కదలివచ్చి మహంకాళి అమ్మవారికి బోనాలు సమర్పించడంతో ప్లేగు వ్యాధి నుండి విముక్తి పొందినట్లుగా చెప్పుకుంటారు. ప్రజలు ఆనాటి నుండి ప్రతి సంవత్సరం ఆషాఢ మాసంలో మహాకాళికి బోనాలు సమర్పించడం అనవాయితీగా వస్తున్న సంప్రదాయంగా పేర్కొనవచ్చు. అదేవిధంగా మరొక సంఘటన 1869లోనూ జంటనగరాలలో మలేరియా ప్రబలడంతో తీవ్ర ప్రాణనష్టం సంభవించిన దరిమిలా, ఆనాడు సైతం మహాకాళీ

అమ్మవారిని ప్రసన్నం చేసుకొనే పేరిట తొలి బోనాల జాతర నిర్వహించారు. తరువాత నిజాం నవాబు కూడా ఈ ఉత్సవాలు అధికారికంగా నిర్వహించేందుకు ఉత్తర్వులు ఇచ్చారు. ఇప్పటికి ఆ ఆనవాయితీ అంగరంగ వైభవంగా కొనసాగుతూ వస్తోంది. ఆషాఢ బోనాల పండగ అంటే గ్రామదేవత అమ్మవారుని పూజించే పండుగ. భోజనం ప్రకృతి. బోనం వికృతి. బోనం అంటే భోజనం. దీన్ని కొత్తకుండలో వండి, ఇంటిల్లిపాది డప్పువాద్యాలతో ప్రదర్శనగా వెళ్లి ప్రతివీధిలోఉన్న గ్రామదేవతలకు మొక్కుబడులను భక్తి ప్రపత్తులతో సమర్పించుకుంటారు. అందుకు ముందుగా సిద్ధంచేసిన చిన్నముంతలో పానకం పోస్తారు. దానిపై దివ్వె పెట్టి బోనంజ్యోతి వెలిగించి జాతర కన్నుల పండువగా నిర్వహిస్తారు. వేటపోతు మెడలో వేపమండలుకట్టి వ్యాధి నిరోధకశక్తిని పెంచే పసుపు కలిపిన నీరు, వేపాకుల్ని చల్లుకుంటూ భక్తులు ఊరేగింపుగా గ్రామదేవతల ఆలయాలకు తరలివెళ్లి బోనాలు సమర్పిస్తారు. ఇలా బోనాల సమర్పణ వల్ల దేవతలు శాంతించి అంటువ్యాధులు రాకుండా కాపాడుతారని ప్రజల ప్రగాఢ విశ్వాసం. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత బోనాలను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నారు.

గ్రామదేవితకు సమర్పించే నైవేద్యం :

తెలంగాణ ప్రాంతంలోని ప్రజలు భక్తి శ్రద్ధలలో ఈ పండుగను బహునిష్ఠతో, విశ్వాసంతో జరుపుకునే ఈ పండుగ ప్రతి ఆదివారం ఉదయాన్నే లేచి, స్నానంచేసి, కొత్తబట్టలు ధరిస్తారు. స్త్రీలు, కొత్త మట్టి కుండలను కొని, దానిని కడిగి, అందులో అన్నం, పెరుగు, నీరు మరియు బెల్లం కలిపి ఉడికించాలి. కుండ ఎరుపు, తెలుపు మరియు పసుపు రంగుల కలయికతో అలంకరించబడుతుంది. కుండలపై పసుపు, కుంకుమ, వేపాకులు, దీపంతో అలంకరిస్తారు. ఈ కుండ అమ్మవారికి సమర్పించే నైవేద్యం. స్త్రీలు వారి సాంప్రదాయాన్ని అనుసరించి వారి వారి శక్త్యానుసారం వండిన అన్నంతో పాటు పాలు, పెరుగు, బెల్లం, కొన్నిసార్లు ఉల్లిపాయలతో కూడిన బోనాన్ని మట్టి, ఇత్తడి లేక రాగి కుండలలో తమ తలపై పెట్టుకుని, డప్పు, ఆటగాళ్ళ తోడ్కొని రాగా దేవి గుడికి వెళ్తారు. మైసమ్మ, పోచమ్మ, ఎల్లమ్మ, పెద్దమ్మ, డొక్కాలమ్మ, అంకాలమ్మ, పోలేరమ్మ, మారెమ్మ మున్నగు పేర్లు కల ఈ దేవీ, దేవతల గుళ్ళను దేదీప్యమానంగా అలంకరించిన అమ్మవార్లకు బోనం నైవేద్యంగా బోనం సమర్పిస్తారు.

పోతురాజు వీరంగం :

బోనాలసందర్భంగా దేవీసోదరుడుగా పోతురాజువేషధారి, పాత్రను పోషించే వ్యక్తి స్ఫురద్రూపిగా బలశాలిగా ఉంటాడు. ఒంటిపై పసుపు, నుదుటిపై కుంకుమ, కాలికి గజ్జెలు కలిగి, చిన్న ఎర్రని ధోతీని ధరించి డప్పు వాయిద్యానికి అనుగుణంగా ఆడతాడు. పోతురాజు, మాతృదేవత యొక్క సోదరుడిగా పరిగణించబడతాడు. బోనాల పండుగలో పోతరాజుల విన్యాసాలు, రంగం లాంటివి ప్రత్యేకంగా ఆకట్టుకుంటూ (ఆషాఢ) మాసంలో దేవికొలువై ఉన్న ఆలయాలకు వెళ్ళడానికి కారణమేమంటే దేవి తన పుట్టింటికి వెళుతుందని నమ్మకం, అందుకే భక్తులు ఈ పండుగ సమయంలో దేవిని దర్శించుకుని తమ స్వంత కూతురు తమ ఇంటికి వచ్చిన భావనతో భక్తి శ్రద్ధలతోనేగాక ప్రేమానురాగాలతో బోనాలను ఆహార నైవేద్యంగా సమర్పిస్తారు. ఈ తంతును ఊరడి అంటారు. ఊరడి తర్వాతి కాలంలో బోనాలుగా మారింది. బోనాల సందర్భంగా పొట్టేళ్ళ రథంపై అమ్మవారి ఊరేగింపు చేస్తారు. పూర్వకాలంలో ఈ పండుగ రోజున దుష్టశక్తులను పారద్రోలటానికి ఆలయ ప్రాంగణంలో ఒక దున్నపోతును బలి ఇచ్చేవారు. నేడు దున్నపోతులకు బదులు కోడిపుంజులను బలిఇవ్వడం ఆనవాయితీగా మారింది.

రంగం :

ఈ పండుగ రోజున స్త్రీలు పట్టుచీరలు, నగలు ధరిస్తారు. పూనకం పట్టిన కొందరు స్త్రీలు తలపై కుండని (బోనం) మోస్తూ డప్పుతో లయబద్ధమైన మోతలకు అనుగుణంగా దేవిని స్మరిస్తూ నర్తిస్తారు. బోనాలను మోసుకెళ్తున్న మహిళలను దేవీ అమ్మవారు ఆవహిస్తారని విశ్వాసము. మహంకాళి అంశ రౌద్రాన్ని ప్రతిబింబిస్తుంది. కావున ఆమెను శాంతపరచడానికై ఈ మహిళలు ఆలయమును సమీపించు సమయములో వారి పాదాలపై మిగిలిన భక్తులు నీళ్ళు కుమ్మరిస్తారు. తమ భక్తికి చిహ్నంగా ప్రతి భక్తబృందమూ ఒక తొట్టెలను (కాగితమూ, కర్రలతో కూర్చబడిన చిన్న రంగుల పరికరము) సమర్పించడం ఆచారంగా వస్తూ ఉంది. బోనాలపండుగ జనసందోహం గోల్కొండకోట లోని గోల్కొండ ఎల్లమ్మ ఆలయం వద్ద మొదలయ్యి లష్కర్ బోనాలుగా పిలువబడే సికింద్రాబాదులోని ఉజ్జయిని మహంకాళి ఆలయము, బల్కంపేట్ లోని ఎల్లమ్మ దేవాలయాల మీదుగా ఓల్డ్‌సిటీ ప్రాంతానికి చేరుకుంటుంది. పండుగ మరుసటి రోజు ఉదయం తర్వాత రంగం, ఒక స్త్రీ పై మహంకాళి దేవత ఆవహించి (భవిష్యవాణి) భవిష్యత్తు గురించి అడిగినప్పుడు ఆ సంవత్సరంలో జరగబోయే కష్టసుఖాలు చెబుతుండడం, ఆమె చెప్పినప్రకారం జరుగుతుండడం ఆనవాయితీగా వస్తున్న ఆచారంగా భక్తుల విశ్వాసం. అమ్మవారు పలకబోయే భవిష్యత్ ప్రణాళిక వినడానికి జనాలు తండోప తండాలుగా తరలిరావడం విశేషం. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ విషయాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడం గమనార్హం. ఆషాఢ బోనాల పూజా ఆచారాలలో మొదటి ఆదివారం నాడు. గోల్కొండ కోటలోని శ్రీ జగదాంబ ఆలయంలో పూజలు నిర్వహిస్తారు. బల్కంపేట్‌లోని బల్కంపేట్ ఎల్లమ్మ ఆలయం, సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి ఆలయంలో రెండవ ఆదివారం ఆచారాలు జరుగుతాయి. దీనిని లష్కర్ బోనాలు అని పిలుస్తారు. ఆషాడ మాసం మూడో ఆదివారం చిలకలగూడలోని పోచమ్మ, కట్టమైసమ్మ దేవాలయం, చివరిగా హైదరాబాద్ పాతబస్తీ, లాల్‌దర్వాజలోని మాతేశ్వరి ఆలయంలో పూజలు నిర్వహిస్తారు. ఈ విధంగా తెలంగాణప్రాంతంలో ఉ

న్న గ్రామదేవతల ఆలయాల్లో సంప్రదాయం ప్రకారం బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తున్న సాంప్రదాయం.

విందు :

సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లో కొలువైయున్న ఉజ్జయిని మహాంకాళి ఆలయంలో సమర్పించిన బోనం దైవ ప్రసాదాన్ని ఇంటిల్లిపాది, కుటుంబసభ్యులతో అతిథులతో పంచుకుంటూ విందు ఆరగిస్తారు. ఆ మరుసటి ఆదివారాలలో హైదరాబాద్, సికింద్రాబాద్‌లలో కొలువైయున్న గ్రామదేవతల ఆలయాలలో అలంకరించిన దేవికి వీధివీధిలో ఉన్న ప్రజలు తమ ఇంటివద్దనే కొలువైయున్న ఆలయాలకు తరలివెళ్ళి దేవికి మొక్కుబడులు, బోనం సమర్పించి ఆ ప్రసాదాన్ని ఆరగించి అమ్మ దయకు పాత్రులవుతారు.

ఘట్టం (అమ్మవారి ఊరేగింపు) :

బోనాల పండుగలో ముఖ్యమైన ఘట్టం అమ్మవారి ఊరేగింపు. ఊరేగింపు సమయంలో అమ్మవారి రథం ముందు డప్పుచప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలు, వేపాకులతో పాటు, గుగ్గిలం పొగ వేస్తారు. ఈ ఊరేగింపుకి కూడా నేపథ్యం ఏమిటంటే ఊరేగింపు సమయంలో డప్పుచప్పుళ్లు, ఆ చప్పుళ్లతో పాటు పోతరాజులు నృత్యం చేస్తూ అరుస్తారు. అప్పుడు ఆ డప్పుచప్పుడు, పోతరాజుల అరుపుకు ఊర్లో ఉన్న కొన్ని ప్రమాదకరమైన జంతువులు భయంతో పారిపోతాయి. అమ్మవారి ఊరేగింపు సమయంలో అమ్మవారికి గుగ్గిలం పొగ వేస్తారు. వర్షాకాలంలో వ్యాప్తిచెందే దోమలు, ఇతర క్రిమికీటకాల నుండి రక్షణకు ఈ పొగవేయడంతో, ఆ పొగవల్ల క్రిమికీటకాదులు నశిస్తాయి. తద్వారా అంతర్లీనంగా సమాజ శ్రేయస్సుకు హితం కోరే విధంగా బోనాల పండుగ నేపథ్యం ఉంటుందన్నది సుస్పష్టం. ఘట్టం ఒక రాగి కుండను సూచిస్తుంది, ఇది తల్లి దేవత రూపంలో అలంకరించబడి పూజారి చేత తీసుకువెళ్ళబడి, సాంప్రదాయ ధోతిని అలంకరిస్తుంది మరియు అతని శరీరం పూర్తిగా పసుపు రంగులో ఉంటుంది. పండుగ మొదటిరోజు నుండి చివరిరోజు వరకు నీటిలో మునిగితే ఘట్టం ఊరేగింపుగా తీసుకుంటారు. ఘట్టం డ్రమ్స్ (వాయిద్యాల)తో పాటు వస్తుంది. సాధారణంగా హరిబౌలిలోని అక్కన్న మదన్నా ఆలయానికి చెందిన ఘటం ఊరేగింపుకు నాయకత్వం వహిస్తుంది. జంటనగరాల్లోని మహాకాళి, ఇంకా ఇతర ప్రసిద్ధ దేవాలయాల నుండి ఘటములు ఊరేగింపుగా చేరి, ఇక్కడ సమావేశమవుతారు. ఈ ఘటముల ఊరేగింపు అందంగా, ఆకర్షణీయంగా భక్తుల హృదయాలను ఆకట్టుకునే విధంగా ఉండటంతో భక్తులు సమూహంగా తరలి వచ్చి ఊరేగింపు వెంట సాగుతూ కోలాహలంగా సంబరాలు జరుపుకుంటారు. చివరగా నయాపూల్ వద్ద ఘూటమ్ నిమజ్జనంతో బోనాలపండుగ ముగుస్తుంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వనిరీతిలో బోనాల పండుగ జాతరను ఆనందంగా జరుపుకుందాం.

శుభం భూయాత్
సర్వే జనాః సుఖినో భవంతు.
ఓం శాంతి శాంతిః

-శారద శృంగేరి
9490 26 1119

డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా మొక్కలు నాటిన బిజెపి నాయకులు

రాజన్న సిరిసిల్ల, జులై 6 :(నేటినిజం ప్రతినిధి):, డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా పురస్కరించుకొని మొక్కలు నాటే కార్యక్రమం మండల అధ్యక్షులు జక్కుల తిరుపతి ఆధ్వర్యంలో వేములవాడ రూరల్ మండలం హనుమాన్ పేట గ్రామంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర నాయకులు డాక్టర్ చెన్నమనేని వికాస్ హనుమాన్ పేట్ గ్రామంలో మార్కండేయ స్వామి ఆలయం వద్ద అమ్మ పేరుతో మొక్కలు నాటారు. అనంతరం వికాస్ మాట్లాడుతూ అఖండ భారత్ జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఏక్ దేశమే దో విధాన్ ధో ప్రధాన్ నహి చేలెంగే అని నినాదించిన గొప్ప నాయకుడు అఖండ భారత్ కోసం ప్రాణాలర్పించిన భరత మాత ముద్దు బిడ్డ డా. శ్యాం ప్రసాద్ ముఖర్జీ మహా నాయకునికి నమస్సుమాంజలి తెలియజేశారు. ఈ కార్యక్రమంలోమండల ఉపాధ్యక్షులు జంకె మధు. ఓబిసి మండల అధ్యక్షులు మల్యాల రాజు గౌడ్ కిషన్ మోర్చా మండల అధ్యక్షులు గొల్లపల్లి వెంకటేష్ కిషన్ మోర్చా ప్రధాన కార్యదర్శి కావేరి రాజు. గ్రామ శాఖ అధ్యక్షులు అడేపు విజయ్ కల్లెట్ల నరేష్. ఓబిసి మండల ఉపధ్యక్షులు పల్లికొండ నారాయణ నాయకులు అడ్డిక సంతోష్ రెడ్డి మురుగం అనిల్ రాజు పరశు రం అవునూరి లక్ష్మిరాజం.సందేల నమన్.తీగల రంజిత్.గొర్రె రఘు.గొర్రె శ్రీకాంత్.బుర్ర పర్శరం.అనిల్.రాజు పాల్గొన్నారు

తెలంగాణలో తెలుగుదేశం పార్టీ పుంజుకుంటుంది ..
టీఎన్ఎస్ఎఫ్ కరీంనగర్ పార్లమెంట్ అధ్యక్షుడు- మోతె రాజిరెడ్డి



రాజన్న సిరిసిల్ల, జులై 6 :(నేటినిజం ప్రతినిధి): రానున్న రోజుల్లో తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం వస్తుందని,ప్రత్యక్ష రాజకీయాల్లో ముఖ్యపాత్ర పోషిస్తామని మోతె రాజిరెడ్డి అన్నారు.

ఈ సందర్భంగా సిరిసిల్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మోతె రాజిరెడ్డి మాట్లాడుతూ తేదీ 7 ఆదివారం రోజున హైదరాబాద్ ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్లో నిర్వహించే సభకి నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన తర్వాత మొదటిసారి హాజరవుతున్న నారా చంద్రబాబు గారి రేపటి సమావేశానికి రాజన్న సిరిసిల్ల జిల్లా నుండి తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆరే మల్లేశం,తుమ్మనపెల్లి సత్యం,బైరగొని ప్రవీణ్ గౌడ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు

మీ పేరిట ఎన్ని సిమ్ కార్డులున్నాయి?? జాగ్రత్త!!

హైదరాబాద్ జూలై 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ప్రభుత్వం ప్రతి ఐదేళ్లలో ప్రజలకు ఏదో ఒక మెలిక పెడుతోంది. ఇప్పుడు తాజాగా సిమ్ కార్డుల పరిమితి పై దృష్టి సారించింది. గతంలో గుర్తింపు కార్డు ఏదో ఒకటి ఉంటే సరిపోయేది. తర్వాత రాను రాను నియమాలు పెంచేశారు. గతంలో రెసిడెన్స్ సర్టిఫికేట్, ఎడ్యుకేషన్ సర్టిఫికేట్, ఇన్కమ్ సర్టిఫికేట్, కేస్ట్ సర్టిఫికేట్ ఇలా ఉంటుండేవి. వాటి తర్వాత రేషన్ కార్డు, ఓటర్ కార్డు, పాన్ కార్డు, ఆధార్ కార్డు అంటూ నియమాలు పెంచేశారు.ఇప్పుడు తాజాగా మీకు ఎన్ని సిమ్ కార్డులు ఉండాలో ఆంక్ష పెడుతున్నారు. అసలు టెలికామ్ చట్టం ఏమి చెబుతోంది? ఒక వ్యక్తి (జమ్మూకశ్మీర్, అస్సాం, ఈశాన్య రాష్ట్రాలు తప్పించి) ఏ రాష్ట్ర పౌరుడైనా తన పేరిట తొమ్మిది వరకు సిమ్ కార్డులు కలిగి ఉండొచ్చని నియమం ఉంది.కొత్త టెలికామ్ చట్టం 2023 ప్రకారం నిర్ధారించిన దానికన్నా ఎక్కువ సిమ్ కార్డులు ఉంటే బాధ్యుడిని చేస్తారు. మీరు ఆరు లేక తొమ్మిది కన్నా ఎక్కువ సిమ్ కార్డులను కలిగి ఉంటే మీరు పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుంది. మొదటి సారి చేసే అపరాధానికి రూ. 50000 పెనాల్టీ, తర్వాత అదే తప్పు చేస్తే రూ.200000 వరకు పెనాల్టీ పెరుగుతుంది. ప్రస్తుతానికి సిమ్ కార్డులపై పరిమితి ఖచ్చితంగా ఆచరించనప్పటికీ, మోసపూరితంగా సిమ్ కార్డులు తీసుకుంటే మూడేళ్ల జైలు శిక్ష, రూ. 50 లక్షల వరకు జరిమాన పడే అవకాశం ఉంది. నిర్ణీత పరిమితికి మించి మీరు సిమ్ కార్డులు కలిగి ఉంటే, లేదా మీ పేరిట వేరే వారు సిమ్ కార్డులు తీసుకున్నా మీరు భాధ్యులు కావొచ్చు. మీ పేరిట ఎన్ని సిమ్ కార్డులున్నవి ట్రాక్ చేసుకోండి.మీ పేరు మీద వేరే వారు సిమ్ కార్డు తీసుకుని మోసపూరిత వ్యవహారాలకు ఉపయోగిస్తే?మీకు ముప్పు రావొచ్చు. అందుకనే మీ పేరిట ఎన్ని సిమ్ కార్డులు ఉన్నాయన్నది చెక్ చేసుకోండి. అందుకు మీరు 'సంచార్ సాథీ' అనే పోర్టల్ కు వెళ్లి అప్పుడప్పుడు చెక్ చేసుకోవాలి. సంచార్ సాథీ పోర్టల్ మీ ఆధార్ కార్డుతో ఎన్ని సిమ్ కార్డులు ఉన్నాయో చూపుతుంది. అందుకేమి చేయాలి?

చిటికెనకు చేనేత సంఘ సన్మానం

-చేనేత వస్త్ర వ్యాపార సంఘ ఘన సన్మానాన్ని అందుకున్న డా. చిటికెన కిరణ్ కుమార్.

హైదరాబాద్, జులై 6 :వస్త్రోత్పత్తి నందు రాష్ట్రంలోనే దశాబ్దాల చరిత్ర కలిగిన సిరిసిల్ల చేనేత వస్త్ర వ్యాపార సంఘం బుధవారం రోజున నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో పలు జాతీయ అంతర్జాతీయ అవార్డుల గ్రహీత, ప్రముఖ సాహితీవేత్త, విమర్శకులు డాక్టర్ చిటికెన కిరణ్ కుమార్ ను వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షులు తాటిపాముల దామోదర్ శాలువా, జ్ఞాపిక తో ఘనంగా సన్మానించారు. సంఘ బాధ్యులు మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయంగా రచనల ద్వారా సిరిసిల్ల పేరు ప్రఖ్యాతులను, కీర్తి ప్రతిష్టలను చిటికెన కిరణ్ కుమార్ ఉన్నత స్థానంలో నిలుపుతున్నాడని అందరూ గర్వించదగ్గ విషయం అని శుభాకాంక్షలు తెలియజేశారు.

కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి గౌడ రాజు, ఉపాధ్యక్షులు ఏనుగుల ఎల్లయ్య, శ్రీగాద విష్ణు, సాప భగవాన్ మరియు పారిశ్రామికవేత్తలు చిలుక సత్యం , చిటికెన వెంకటేశం, ఏనుగుల లక్ష్మణ్, గౌడ కిరణ్, ఎల్దండి శ్రీనివాస్ పురప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

కిడ్స్ కాన్వెంట్ స్కూల్‌లో ఘనముగా బోనాల పండగ

రాజన్న సిరిసిల్ల, జులై 6 :(నేటినిజం ప్రతినిధి): కిడ్స్ కాన్వెంట్ స్కూల్ లో ఆషాఢ మాసము సందర్భంగా బోనాల పండగ ను నిర్వహించారు చిన్నారులు బోనాలను అమ్మ వారికి సమర్పించి భక్తి శ్రద్ధలతో బోనాల వండగను జరుపుకున్నారు ఉపాధ్యాయులు బోనాల పండగ విశిష్టత గురించి పిల్లల కు అర్థము చేపించారు అనంతరం పిల్లలు తమ నృత్యంతో అందరిని ఆకట్టు కున్నారు ఈ కార్యక్రమం లో కరస్పాండెంట్ నరాల దేవేందర్, ప్రిన్సిపాల్ ధర్శన్ వసుపియా, టీచర్స్ పాల్గొన్నారు

కేంద్రమంత్రి బండి సంజయ్ కోసం కొండగట్టు అంజన్న స్వామికి తలనీలాలు సమర్పించిన-అజయ్ వర్మ..



కరీంనగర్, జులై 6 : (నేటినిజం ప్రతినిధి) పార్లమెంట్ ఎన్నికల్లో బండి సంజయ్ కుమార్ భారీ మెజారిటీతో గెలుపొందితే కేంద్ర మంత్రి కావాలని ఆకాంక్షిస్తూ బిజెపి రాష్ట్ర నాయకులు సొల్లు అజయ్ వర్మ కొండగట్టు అంజన్న స్వామి వద్ద మొక్కుకున్నారు. ఎన్నికల్లో బండి సంజయ్ కుమార్ భారీ మెజారిటీతో గెలుపొంది, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో శనివారం రోజున సొల్లు అజయ్ వర్మ కొండగట్టు అంజన్న స్వామి దర్శించుకుని మొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా సొల్లు అజయ్ వర్మ తలనీలాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.